అపోహలతో విచారణను

ఇతర ధర్మాసనానికి బదిలీ చేయలేం

- 'ఓటుకు నోటు' కేసులో సుప్రీం ధర్మాసనం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 30 | విజయవాడ, శుక్రవారం 30 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50


Vol No | Vijayawada, Friday 30 August 2024 | Rs



బ్యాడ్మింటన్‌లో మనీషా, తులసి గెలుపు

- పారిస్ పారా ఒలింపిక్స్

8



విజయవాడ మెట్రో ప్రణాళిక

విజయవాడ, విశాఖ మెట్రోలకు త్వరలో శ్రీకారం

జనవరి 1 నుండి అమరావతి నిర్మాణ పనులు : మంత్రి నారాయణ వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి నిర్మాణ పనులను 2025 జనవరి ఒకటోతేదీ నుండి ప్రారంభిస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశం గురువారం జరిగింది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం మీడియాకు నారాయణ వివరించారు. అమరావతి పనులతో పాటే విజయవాడ, విశాఖ మెట్రో పనులను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. 3.26 ఎకరాల్లో నిర్మిస్తున్న సిఆర్‌డిఎ భవనానికి రూ.160 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పూర్తయిన అనంతరం సిఆర్‌డిఎ, ఎడిసితోపాటు మున్సిపల్ పరిపాలనకు సంబంధించిన అన్ని కార్యాలయాలను ఇక్కడకు తరలిస్తామని తెలిపారు. సీడ్ క్యాపిటల్ ఏరియాలో హ్యాపినెస్ట్ కోసం 14.64 ఎకరాల్లో జిప్లస్18 పద్ధతిలో 12 టవర్లను నిర్మాణ పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. గతంలో దీనికోసం రూ.714 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేయగా, ప్రస్తుతం రూ.930 కోట్లకు చేరిందని పేర్కొ న్నారు. రాజధాని రైతులకు ఇవ్వాల్సిన వార్షిక కౌలును సెప్టెంబరు 15లోపు వారి ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు.. గత ఏడాది చెల్లించాల్సిన రూ.175 కోట్లను ప్రస్తుతం చెల్లిస్తామని, ఈ ఏడాది రూ.225 కోట్లను కొంత సమయం తరువాత చెల్లిస్తామని వివరించారు.

విజయవాడ మెట్రో ఇలా...

విజయవాడ మెట్రోకు సంబంధించి తొలిదశలో పిఎన్‌బిఎస్ (పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్) నుండి గన్నవరం ఎయిర్‌పోర్టు వరకూ 25.95 కిలోమీటర్లు, బస్టాండు నుండి పెనమలూరు వరకు 12.45 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటిదశలో మొత్తం 38.40 కిలోమీటర్లకు రూ.11,900 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు. పిఎన్‌బిఎస్ నుండి రాజధాని అమరావతికి 27.80 కిలోమీటర్ల మేర మరోలైనును రెండో దశలో చేపట్టేందుకు డిపిఆర్ రూపకల్పన మిగతా 2లో

ఇద్దరు వైసిపి రాజ్యసభ సభ్యులు రాజీనామా

- 11 నుండి 9కి తగ్గిన బలం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ రాజ్యసభ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. వీరి రాజీనామాలను రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ వెంటనే ఆమోదించారు. వెంకటరమణ పదవీకాలం 2026 వరకు ఉండగా, మస్తాన్‌రావు పదవీకాలం 2028 వరకు ఉంది. వీరిద్దరూ టిడిపిలో చేరనున్నారు. కనీసం ఆరుగురు వైసిపి రాజ్యసభ సభ్యులు పార్టీని వీడనున్నారని ఒక టిడిపి నేత తెలిపారు. వారిలో కొందరు టిడిపిలోనూ, మరికొందరు బిజెపిలోనూ చేరే అవకాశం ఉందని సమాచారం. ఈ ఇద్దరి రాజీనామాతో రాజ్యసభలో వైసిపి ఎంపిల సంఖ్య 11 నుండి తొమ్మిదికి పడిపోయింది.రాజ్యసభలో ప్రస్తుతం టిడిపికి ఒక్క స్థానం కూడా లేదు. ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తే, అవి టిడిపి ఖాతాలో జమవుతాయి. ఎన్ కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో పలుమార్లు మంత్రిగా పనిచేసిన మోపిదేవి వెంకటరమణ, జగన్‌మోహన్‌రెడ్డికి విధేయుడిగా ఉన్నారు. గత ఎన్నికల్లో రేపల్లె అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ నిరాకరించడంతో వైసిపితో విభేదించారు. కిరణ్‌కుమార్ రెడ్డి మంత్రివర్గంలో ఉండగా, వాడరేవు, నిజాంపట్నం ఇండస్ట్రియల్ కారిడార్ (వాన్‌పిక్) కుంభకోణంలో వెంకటరమణను సిబిఐ అరెస్టు చేసింది.

టిడిపిలో చేరతా : వెంకటరమణ

టిడిపిలో చేరుతున్నానని, అందులో దాపరికం లేదని మోపిదేవి వెంకటరమణ తెలిపారు. రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమని, జగన్మోహన్‌రెడ్డి 100 శాతం తనకు సహకరించారన్నారు. కొన్ని సందర్భాలు, అంశాల్లో విభేదాలు వచ్చాయని, అందుకే పార్టీ మారాలనే నిర్ణయానికి వచ్చానని అన్నారు.

వ్యక్తిగత కారణాలతో రాజీనామా : బీద మస్తాన్‌రావు

తన వెనుక ఎటువంటి ప్రలోభాలు లేవని బీద మస్తాన్‌రావు అన్నారు. స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామని, ఇంతకాలం పార్టీలో గౌరవం, అవకాశం ఇచ్చిన వైసిపి అధినేత జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలని అన్నారు.

భద్రతకు ప్రాధాన్యత

- కార్మికశాఖపై సమీక్షలో సిఎం
- రూ.10 లక్షల బీమాకు త్వరలో శ్రీకారం



కార్మిక, పరిశ్రమలు, బాయిలర్స్, మెడికల్ సర్వీసెస్ శాఖలపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. కార్మికశాఖ, పరిశ్రమలు, బాయిలర్స్, మెడికల్ సర్వీసెస్ శాఖలపై గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల భద్రత విషయంలో రాజీ పడకూడదని అన్నారు. భద్రతా ప్రమాణాలపై థర్డ్ పార్టీ ఆడిట్ తప్పనిసరని చెప్పారు. తనిఖీలు భద్రతను పెంచేలా, తప్పులు సరిదిద్దేలా ఉండాలన్నారు. అంతేకానీ తనిఖీల పేరుతో పరిశ్రమల యాజమాన్యాలను వేధింపులకు గురిచేయకూడదని అధికారులకు సూచించారు. ప్రమాదం జరిగిన సమయంలో హడావుడి చేసి తరువాత భద్రత గురించి పట్టించుకోవడం లేదని, ఇది సబబు కాదని అన్నారు. దీనిపై నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్లాలని చెప్పారు.

అధికారులు తరచూ తనిఖీలు చేయడంతోపాటు నిబంధనల అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలు ఏర్పడితేనే ఉపాధి లభిస్తుందన్న విషయాన్ని కూడా అధికారులు గుర్తుంచుకోవాలని చెప్పారు. అనుమతుల జారీ విషయంలో పారదర్శకంగా పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా పరిశ్రమలు, సిబ్బంది, వాటి భద్రతపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో 24,642 ఫ్యాక్టరీలు రిజిస్టర్ అయ్యాయని, వాటిల్లో 11.78 లక్షల మంది పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రసాయన పరిశ్రమలు పెరిగిన దృష్ట్యా భద్రతా చర్యలు పర్యవేక్షించడానికి, ప్రమాదాలు అరికట్టడానికి ముగ్గురు కెమికల్ ఇన్‌స్పెక్టర్స్ ఉండాలన్నారు. రాష్ట్రంలో 3,700 బాయిలర్స్ ఉన్నాయని, ప్రతి ఏడాది వీటిని చెక్ చేస్తున్నామని చెప్పారు. .

ఇఎస్‌ఐ ఆస్పత్రులు బలోపేతం

రాష్ట్రంలో ఉన్న నాలుగు ఇఎస్‌ఐ ఆస్పత్రులను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వైద్యుల నియామకంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు. పేదలకు అందే సాయంలో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం తెలిపారు. ఇఎస్‌ఐకి రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన రూ.54 కోట్ల పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలపగా, వాటిని వెంటనే విడుదల చేయాలని ఆదేశాలిచ్చారు. ఆస్పత్రుల్లో సర్వీసులను అవుట్‌సోర్సింగ్‌కు ఇవ్వడం ద్వారా సేవలను మెరుగుపరిచే విషయంలో కసరత్తు చేయాలని సూచించారు. లేబర్ వెల్ఫేర్ బోర్డు, మినిమం వేజెస్‌బోర్డు, బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ బోర్డులను యాక్టివేట్ చేసి కార్మికుల హక్కులు, సంక్షేమం అందేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు.

చంద్రన్నబీమా నిర్వీర్యం

టిడిపి హయాంలో ప్రారంభించిన చంద్రన్నబీమాను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ బీమా కింద 2.50 కోట్ల మంది లబ్ధిదారులు ఉండగా గత ప్రభుత్వంలో 1.22 కోట్లకు తగ్గారని చెప్పారు. ఈ పథకం కింద రూ.10 లక్షలు ఇస్తామనే ఎన్నికల హామీకి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. త్వరలోనే దీన్ని అమల్లోకి తెస్తామని చెప్పారు. కార్మికులకు బీమా అందించేందుకు అవసరమైన చర్యలూ తీసుకుంటామని పేర్కొన్నారు. కార్మికులే కాకుండా ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు, ఇతర వర్గాల వారికి బీమా అందించేలా పథకాన్ని డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ 2014 నుండి 2019 మధ్య ఇఎస్‌ఐ వైద్యసేవలు పొందేవారి సంఖ్య ఐదు లక్షల నుండి 11 లక్షలకు పెరిగితే అనంతరం వచ్చిన ప్రభుత్వ తీరుతో సంఖ్య తగ్గిందని సిఎంకు తెలిపారు.

'ఉపాధి'ని కాపాడుకునేందుకు ఉద్యమం

- మోడీ పాలనలో దిగజారిన పేదల బతుకులు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశంలో విజయరాఘవన్




వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఎ.విజయరాఘవన్

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

ప్రధాని మోడీ పాలనలో దేశంలో పేదల బతుకులు మరింతగా దిగజారాయని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత అధ్యక్షులు ఎ.విజయరాఘవన్ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రెండో రోజులపాటు జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశం ఒంగోలులోని కాపు కల్యాణ మండపంలో గురువారం ప్రారంభమైంది. మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చినా బిజెపి బలం తగ్గిందని, ప్రతిపక్షాల బలం పెరిగిందని, మోడీ నియంతృత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకతకు ఇదొక తార్కాణమని విజయరాఘవన్ తెలిపారు. అయినా, బిజెపి పాలన తీరు మారలేదన్నారు. దేశంలో వ్యవసాయ రంగంతోపాటు ఉత్పత్తి రంగాల్లో సంక్షోభాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఉపాధి తగ్గిందని, నిరుద్యోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలు పేదల బతుకులను ఛిద్రం చేస్తున్నాయన్నారు. భూమిలేని వ్యవసాయ కార్మికులుగానీ, పేదలుగానీ దేశంలో ఇప్పటికీ 47 శాతం మంది ఉన్నారని, రాష్ట్రంలో వీరు 54 శాతం మంది ఉన్నారని తెలిపారు. దేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడే ఎక్కువగా ఉన్నారన్నారు. కేంద్ర విధానాల వల్ల పేదల జీవన ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు. పేదరిక నిర్మూలన, నిరక్ష్యరాస్యత, విద్య, వైద్యం, పౌష్టికాహార లోపం వంటి అంశాలను అధిగమించేందుకు నిధుల కేటాయింపులు తగ్గుతున్నాయని వివరించారు. ఫలితంగా పిల్లలు, మహిళల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఆర్థిక, సామాజిక, భద్రతకు, ఉపాధి, వేతనాలు, భూమి, ఇతర సౌకర్యాల కోసం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు ఉధృతం చేయాలని కోరారు. కేరళలో భూమి, ఇళ్ల స్థలాల సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు, సిఐటియు నాయకులు సయ్యద్ హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రఖ్యాత న్యాయవాది ఎజి నూరాని కన్నుమూత



న్యూఢిల్లీ : ప్రఖ్యాత న్యాయవాది, రాజ్యాంగ నిపుణులు, ప్రముఖ రచయిత ఎజి నూరాని గురువారం ముంబయిలో తన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 94 ఏళ్లు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురువారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. న్యాయవాది వృత్తిలో ఎంతో ఖ్యాతి గడించిన నూరానీ రచయితగానూ అంతే గుర్తింపు పొందారు. 1930 సెప్టెంబరు 16న ముంబయిలో అబ్దుల్ గఫూర్ మజీద్ నూరానీ జన్మించారు. విద్యాభ్యాసం అంతా ఇక్కడే గడిచింది. ముంబయిలోని ప్రభుత్వ లా కాలేజీ నుంచి లా డిగ్రీని పొందారు. బాంబే హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఆయన ప్రాక్టీస్ కొనసాగింది. బ్రిటీష్ పాలనలో ముంబయి హైకోర్టులో ప్రాక్టీస్ చేసిన మొట్టమొదటి భారతీయ న్యాయవాది. 1960 ప్రారంభంలో రచనా వ్యాసంగంలోకి ప్రవేశించారు. 'ది కాశ్మీర్ డిస్ప్యూట్ 1947-2012', 'ఆర్టికల్ 370: ఎ కానిస్టిట్యూనల్ హిస్టరీ ఆఫ్ జమ్మూకాశ్మీర్', 'ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రచించారు.

త్వరలో భారత్ డోజో యాత్ర : రాహుల్



మార్షల్ ఆర్ట్స్ చేస్తున్న రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ : త్వరలో భారత్ డోజో యాత్ర రాబోతుందని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ గురువారం ప్రకటించారు. తాను ఈ ఏడాది ప్రారంభంలో నిర్వహించిన భారత్ జోడో న్యాయ్ యాత్ర క్యాంప్ సైట్లల్లో జరిగిన మార్షల్ ఆర్ట్స్ సెషన్లకు సంబంధించిన ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ పై విషయాన్ని రాహుల్‌గాంధీ తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ స్కూల్ లేదా మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్ హాల్‌ను డోజోగా పేర్కొంటారు. 'భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా మేం వేలాది కిలోమీటర్లు ప్రయాణం చేశాం. మా ప్రతీ క్యాంప్‌సైట్ వద్ద ప్రతీ రోజూ దినచర్యగా జియు-జిట్సును సాధన చేశాం. ఫిట్‌గా ఉండటం కోసం దీని ప్రారంభించినా తరువాత ఇది కమ్యూనిటీ కార్యాచరణగా మారిపోయింది. ఇది మేం బస చేసే పట్టణాలకు చెందిన మార్షల్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌ను యాత్రలోని సహచరులను కలిసిపోయేటట్లు చేసింది' అని రాహుల్ ఎక్స్‌లో చేసిన పోస్టులో తెలిపారు. 'మెడిటేషన్, జియు-జిట్సు, ఐకిడో, అహింసా కాన్‌ఫ్లిక్ట్ రిసోల్యూషన్ టెక్నిక్స్ యొక్క సామరస్య సమ్మేళనమైన 'జెంటిల్ ఆర్ట్' యొక్క అందాన్ని ఈ యువ హృదయాలకు పరిచయం చేయడమే మా లక్ష్యం' అని రాహుల్ పేర్కొన్నారు. హింస స్థానంలో సౌమ్యతను పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తన అనుభవాన్ని ప్రజలతో పంచుకోవాలని అనుకుంటున్నానని, కొంత మందినైనా 'సున్నితమైన కళ'ను అభ్యసించేలా ప్రేరేపించాలని ఆశిస్తున్నానని చెప్పారు. భారత్ డోజో యాత్ర త్వరలో రాబోతోందని రాహుల్ చెప్పారు. ఈ వీడియోలో రాహుల్ గాంధీ చిన్నారులతో కలిసి మార్షల్ ఆర్ట్స్ టెక్నిక్‌లపై సెషన్స్ నిర్వహిస్తున్నట్లు కనిపించారు. అలాగే తాను ఐకిడోలో బ్లాక్ బెల్ట్ అని, జియు-జిట్సులో బ్లూ బెల్ట్ అని రాహుల్‌గాంధీ చిన్నారులకు చెప్పడం కనిపిస్తుంది. వారికి రకరకాల మెళకువలు నేర్పడం కూడా వీడియోలో ఉంది.

స్టీల్‌ప్లాంటుపై తక్షణమే దృష్టి సారించండి

- సిఎంకు వి.శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటు పరిస్థితిపై తక్షణమే దృష్టి సారించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిఎంకు రాసిన లేఖను గురువారం ఆయన మీడియాకు విడుదల చేశారు.

రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ విశాఖపట్నం స్టీలుప్లాంటని, దీనిపై ఆధారపడి ప్రత్యక్షంగా ముప్పైవేలమంది, పరోక్షంగా లక్షమంది ఉపాధి పొందుతున్నారని లేఖలో వివరించారు. పోరాట ఫలితంగా సాధించుకున్న విశాఖపట్నం స్టీలుప్లాంటు పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని తెలిపారు . 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని పేర్కొన్నారు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి స్టీలు ప్లాంటు పూర్తి సామర్థ్యంతో పనిచేసే విధంగా తగుచర్యలు తీసుకోవాలని కోరారు. ముడిసరుకు, వర్కింగు క్యాపిటల్ తగినంతగా లేకపోవడంతో విశాఖపట్నం స్టీలుప్లాంటు ప్రస్తుతం 45 శాతం సామర్థ్యంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా, ప్రస్తుతం 10 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోందని తెలిపారు. దీనివల్ల రోజురోజుకీ నష్టాలు పెరుగుతున్నాయని, ఉత్పత్తి తగ్గింపు వలన యంత్రాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. వీటిని పునరుద్ధరించడం అత్యంత ఖర్చుతో కూడుకున్న పనని తెలిపారు. స్టీలు ప్లాంటు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యకు సొంత గనులు లేకపోవడమే కారణమని స్టీలుశాఖ మంత్రి కుమారస్వామి పేర్కొన్న విషయాన్ని లేఖలో శ్రీనివాసరావు గుర్తుచేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సొంత గనులు కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పూర్తిసామర్యంతో నిర్వహించేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కేంద్రం తక్షణం అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈలోగా ప్లాంటు పూర్తిసామర్థ్యంతో నిరంతరాయంగా నడిపేందుకు అవసరమైన కోల్, ఐరన్ ఓర్‌ను ప్రభుత్వ సంస్థలైన సెయిల్, ఎన్‌ఎండిసి నుండి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సెయిల్‌లో మిగతా 7లో




నావికా దళానికి 'ఐఎన్ఎస్ అరిఘాట్'

రెండో అరిహంత్ క్లాస్ జలాంతర్గామి 'ఐఎన్ఎస్ అరిఘాట్'ను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ గురువారం విశాఖపట్నంలో భారత నావికాదళంలోకి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ అణుత్రయాన్ని 'అరిఘాట్' మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో వ్యూహాత్మక సమతుల్యత, శాంతిని నెలకొల్పడంలో సహాయపడుతుందని, దేశ భద్రతలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని తెలిపారు. భారత నావికాదళం, డిఆర్‌డిఓ కృషిని ఈ సందర్భంగా అభినందించారు.

- ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

అంబానీని దాటేసిన అదానీ

- హురున్ ఇండియా 'కుబేరుల జాబితా' వెల్లడి



2

కార్మికుల ప్రాణాలకు రక్షణేది?

- భద్రత పాటించని యాజమాన్యాలు
- విశాఖ కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా

3

2వ తేదీ కూడా పెన్షన్ అందిస్తాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సామాజిక పెన్షన్లను ఈ నెల 31తోపాటు సెప్టెంబరు 2వ కూడా అందిస్తామని ఎంఎస్ఎంఇ, ఎన్ఆర్ఐ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. టిడిపి కార్యాలయంలో గురువారం జరిగిన గ్రీవెన్స్‌లో పార్టీ నేతలు బొల్లినేని రామారావు, నరసింహప్రసాద్‌తో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 31 పింఛన్లు అందుకోలేని వారు సెప్టెంబరు రెండున కూడా తీసుకోవచ్చునని పేర్కొన్నారు. గ్రీవెన్స్‌లో కొన్ని రెవెన్యూ సమస్యలకు చెందిన దరఖాస్తులు కూడా వచ్చాయని తెలిపారు.

టిడిపి కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

తెలుగు భాషా దినోత్సవ వేడుకలు టిడిపి కార్యాలయంలో గురువారం జరిగాయి. మంత్రి శ్రీనివాస్ పాల్గొని తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

తెలుగువారి కీర్తిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, పార్టీ నాయకులు నరసింహ ప్రసాద్, మురళి, కృష్ణ, రామకృష్ణ, దారపనేని నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఇకపై అవి మహిళా పోలీస్ స్టేషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం దిశ పోలీస్ స్టేషన్ల పేరు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో వున్న మహిళా పోలీస్ స్టేషన్లన్నింటినీ దిశ పోలీస్ స్టేషన్లుగా వైసిపి ప్రభుత్వం పేరు మార్చింది.

అయితే దిశ చట్టాన్ని కేంద్రం ఆమోదించకుండా తిప్పి పంపడంతో అది కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చాక దిశ పోలీస్ స్టేషన్లన్నింటినీ మహిళా స్టేషన్లుగా మారుస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత రెండు నెలల క్రితం పదవీ బాధ్యతలు తీసుకునేటప్పుడే దిశ పోలీస్ స్టేషన్లను మహిళా పోలీస్ స్టేషన్లుగా మారుస్తామని ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

సమన్వయంతోనే నామినేటెడ్ పోస్టులు

- దగ్గుబాటి పురంధేశ్వరి


ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమన్వయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. గుంటూరులోని బిజెపి కార్యాలయంలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడారు. నామినేటెడ్ పోస్టుల భర్తీపై మూడు పార్టీలు కలిసి చర్చించుకుని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వైసిపి లేదా ఇతర పార్టీల నుంచి వచ్చే వారిని బిజెపిలోకి చేర్చుకునే విషయంలో అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పార్టీలో చేరే వారు ఎవరైనా పార్టీ నియమ నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

ఎఐ సిటీగా అమరావతి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- విశాఖ, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు వేగవంతం
- 90 రోజుల్లో సిఆర్‌డిఎ కార్యాలయం పూర్తి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిని ఆర్టిఫిషియట్ ఇంటిలిజెన్స్ (ఎఐ) సిటిగా రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సిఆర్‌డిఎ అధికారులతో సచివాలయంలో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అమరావతి లోగో కూడా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ స్ఫురణకు వచ్చేలా ఆంగ్లంలో రూపొందించాలని సూచించారు. రాజధానిలో ఎటుచూసినా సాంకేతిక సౌలభ్యత ఉట్టిపడేలా నిర్మాణం ఉండాలన్నారు. ప్రభుత్వ భవనాలు పూర్తి చేయడానికి పట్టే సమయం, పనులు చేపట్టడానికి టెండర్లు పిలవడం తదితర అంశాలపై ఈ సమావేశంలో ఆయన సమీక్షించారు. జిప్లస్7 విధానంలో నిర్మిస్తున్న సిఆర్‌డిఎ కార్యాలయాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇప్పుడు వెంటనే పూర్తి చేసి 90 రోజుల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సిఎం సూచించారు. అమరావతిలో నివాసం ఉండాలనుకునే వారికోసం ప్రారంభించిన హ్యాపినెస్ట్‌కు గత ప్రభుత్వ హయంలో తీవ్ర నష్టం జరిగిందని, దానిని పూడ్చుకునేలా చర్యలు తీసుకోవాలని సిఎం చెప్పారు.

అమరావతిలో ఇంకా 3,558 ఎకరాలు సేకరించాల్సి ఉందని, రాజధాని పరిధిలో రెండు గ్రామాల రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అభివృద్ధి చేసిన ప్లాట్లను వారికి కేటాయించే విషయంలో చిన్న చిన్న అభ్యంతరాలు ఉన్నాయనీ పేర్కొన్నారు. దీనిపై రైతులతో మాట్లాడి పరిష్కరించాలని సిఎం ఆదేశించారు. 190 హిటాచీ మిషన్లు కంప తొలగింపు పనులు చేస్తున్నాయని, 60 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు.

మెట్రో రైలు పనులు వేగవంతం

విశాఖ, విజయవాడలో చేపట్టబోయే మెట్రో రైలు ప్రాజెక్టు పనులను త్వరితగతిన చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. అంతకుముందు మెట్రో రైల్ ఎమ్‌డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం మెట్రోను రెండు దశల్లో చేపడతామని తెలిపారు. మొదటిదశలో 46 కిలోమీటర్లు మేర రూ.11,400 కోట్లతో నిర్మిస్తామని, రెండోదశలో 30 కిలోమీటర్లు రూ.5,734 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. దీనికి స్పందించిన సిఎం విశాఖ మెట్రో మొదటిదశలో నాలుగేళ్లలో పూర్తి చేయాలని ఆదేశించారు. విజయవాడలో 38 కిలోమీరట్ల మేర రూ.11 వేల కోట్లతో చేపట్టబోయే మెట్రోరైలు నిర్మాణ ప్రాజెక్టు పనులనూ వేగవంతం చేయాలని అన్నారు.

బిల్లుల రగడ

- ముఖ్యమంత్రి వద్దకు వివాదం
- అధికారుల తీరుపై సర్కారు సీరియస్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కాంట్రాక్టర్లకు ప్రభుత్వం చెల్లిస్తున్న బిల్లులపై వివాదం పెరుగుతోంది. వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు సంబంధించి కొద్ది రోజుల క్రితం పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించడం వివాదాస్పదంగా మారింది. దీనిపై తెలుగుదేశం అనుకూల కాంట్రాక్టర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ఫిర్యాదు చేశారు. 2014-19 సంవత్సరాల మధ్య తాము చేసిన పనులకు వైసిపి ప్రభుత్వం బిల్లులు నిలిపివేసిన విషయాన్ని వారు బాబు వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. దీనిపై అప్పట్లో అనేక మంది న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. అయినప్పటికీ చాలామందికి బిల్లులు రాలేదని తెలిసింది. ఇప్పుడు తెలుగుదేశం మళ్లీ అధికారంలోకి రాగా, 2019 కన్నా ముందు పనులకు బిల్లులు వస్తాయని వారు ఆశలు పెంచుకున్నారు. అయితే ఇప్పుడు కూడా ఆ బిల్లులు రాకపోవడం, 2019 నుంచి 2024 మధ్య కాలంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకే బిల్లుల చెల్లింపుల్లో పెద్దపీట వేస్తున్నారని పాత కాంట్రాక్టర్లు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి సూచనతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి కూడా ఈ విషయాన్ని వారు తీసుకువెళ్లారు. దీంతో ఈ బిల్లుల చెల్లింపులకు కారణం ఎవరున్నారన్న దానిపై పయ్యావుల ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్‌తో కూడా ఆయన మాట్లాడినట్లు సమాచారం. కనీసం తన దృష్టికి రాకుండా బిల్లులు చెల్లించడం పట్ల ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ముఖ్య కార్యదర్శి, కార్యదర్శులే ఈ బిల్లులు చెల్లించారా లేక సిఎఫ్‌ఎంఎస్‌లో ఉన్న వారి హస్తం ఏమైనా ఉందా అన్న కోణంలో ఆయన ఆరా తీస్తున్నట్లు తెలిసింది. సాధారణ ప్రక్రియలో భాగంగానే బిల్లుల చెల్లింపు జరిగి ఉంటాయని గతంలో ఆర్థికశాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు.

నిరాదరణకు గురైన బాలలకు అండగా ఉండండి

- నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న నోబెల్ అవార్డు గ్రహీత కైలాష్ సత్యార్థి

నిరాదరణకు గురైన బాలబాలికల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని, వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నోబెల్ బహుమతి గ్రహీత, బాలల హక్కుల కార్యకర్త కైలాష్ సత్యార్థి పేర్కొన్నారు. బాలల హక్కులపై 'బంగారు బాల్యం' పేరుతో ఒంగోలులోని రిమ్స్ ఆడిటోరియంలో జిల్లా యంత్రాంగం గురువారం నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో 'బాలల బంగారు భవిష్యత్ వైపు ప్రకాశం జిల్లా -100 శాతం సాధన దిశగా' కాన్సెప్ట్‌తో రూపొందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ ప్రతి బిడ్డ సురక్షితంగా, స్వేచ్ఛగా, ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఉండేలా బాలల రక్షణ, పిల్లల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బాలల హక్కులు కాపాడడం, సమాజంలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న కలెక్టర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమానికి కలెక్టర్ వినూత్నంగా రూపకల్పనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలోకలెక్టర్ ఎ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉడకని కోడిగుడ్లు, నీళ్ల చారు

- కూర, భోజనంలో తెల్లని పురుగులు
- మంత్రి ఆదేశించినా మారని తీరు
- నూజివీడు ట్రిపుల్‌ఐటిలో మరో 114 మందికి అస్వస్థత





బెండకాయ కూరలో వచ్చిన తెల్లని పురుగు , విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడుతున్న ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారుల బృందం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటిలో జ్వరాలు, ఇతర రోగాల తీవ్రత కొనసాగుతోంది. గురువారం మరో 114 మంది అస్వస్థతకు గురై కళాశాలలోని ఆస్పత్రిలో చికిత్స పొందారు. మంత్రి, ఉన్నతాధికారులు స్వయంగా కళాశాలను సందర్శించి పరిశుభ్రతతోపాటు ఆహార పదార్థాల నాణ్యత మెరుగుపర్చాలని ఆదేశించినా సంబంధిత అధికారులు, మెస్ కాంట్రాక్టర్ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం విద్యార్థులకు పెట్టిన బెండకాయ కూరలో తెల్లని పురుగులు రావడం కలకలం రేపింది. మెస్ కిచెన్‌లో అపరిశుభ్రత వాతావరణం వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.


బుధవారం 800 మంది అస్వస్థతకు గురికాగ గురువారం మరో 114 మంది అస్వస్థతకు గురై అవుట్ పేషెంట్లుగా చికిత్స పొందారు. మరో ఏడుగురు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో కళాశాలలోని ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీంతో గతవారం రోజుల్లో నూజివీడు ట్రిపుల్ ఐటిలో అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య 900 దాటింది. జ్వరం, ఒళ్లు నొప్పులు, నరాల పోటు, కీళ్లనొప్పులు, డయేరియా, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో విద్యార్థులు బాధపడుతున్నారు.

మంత్రి ఆదేశించినా నాణ్యమైన భోజనం నిల్

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి బుధవారం అర్ధరాత్రి వరకూ సమీక్షించారు. మెస్‌లో ఆహార నాణ్యతను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశించారు. అయితే మంత్రి వెళ్లిన తెల్లారే గురువారం ఉదయమే ఉడకని కోడిగుడ్లు, ఉప్మా అల్పాహారంగా విద్యార్థులకు పెట్టడం గమనార్హం. విద్యార్థులు వాటిని తినలేక చెత్త కుండీల్లో పారేశారు. కనీసం మధ్యాహ్నం భోజనమైనా పరిశుభ్రంగా ఉంటుందని ఆకలితో వచ్చిన విద్యార్థులకు నిరాశే ఎదురయ్యింది. నీళ్ల చారు, నీళ్లను తలపించే మజ్జిగ, బెండకాయ కూర, అన్నంలో పురుగులు రావడంతో తినలేక మళ్లీ చెత్త కుండీల్లో పడేశారు.

అపరిశుభ్రతే కారణం : మల్లీశ్వరి

మంత్రి ఆదేశాలను సైతం అమలు చేయకపోవడం, ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చకపోవడం దారుణమని ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.మల్లీశ్వరి అన్నారు. ట్రిపుల్ ఐటిని ఆమె నేతృత్వంలో అధికారుల బృందం గురువారం సందర్శించింది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పరిశీలించి, అనంతరం వంట చేసే ప్రాంతాలన్నింటినీ పరిశీలించింది. ఈ బృందం పరిశీలన కొనసాగిస్తున్న సమయంలోనే భోజనంలో తెల్లని పురుగులు రావడం గమనించారు. అపరిశుభ్రంగా ఉన్న వంటశాలలు గుర్తించారు. ప్రతి విద్యార్థి నుండి అనారోగ్య కారణాలను అడిగి తెలుసుకున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. మెడికల్, కళాశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆహార పదార్థాల నాణ్యతతోపాటు పరిశుభ్రతలేమి కారణమే సమస్యకు మూలమని తెలిపారు.



గిడుగు రామమ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంబివికె ట్రస్టు చైర్మన్ పి.మధు, బాధ్యులు పి.మురళీకృష్ణ, తెలుగు పండితులు శివరామకృష్ణ

తెలుగు ఔన్నత్యం కోసం పాటుపడాలి

- భాషోపన్యాసకులు వెంకట శివరామకృష్ణమూర్తి
- ప్రజల దైనందిన వ్యవహారిక భాష తెలుగు : మధు

ప్రజాశక్తి-విజయవాడ

తెలుగు వ్యవహారికోద్యమ వేత్త, గొప్ప మేధావి గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు భాషాభ్యున్నతికి తన జీవితాన్ని త్యాగం చేశారని తెలుగు భాషోపన్యాసకులు వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి అన్నారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు 161వ జయంతి వేడుకలు విజయవాడ బాలోత్సవ భవనంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి మధు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణమూర్తి మాట్లాడుతూ...తెలుగు భాషోద్యమానికి యనలేని సేవ చేసిన వెంకట రామమూర్తి పంతుల జయంతిని మాతృభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఆయనను ప్రేమించడం అంటే ఆయన సిద్ధాంతాలను, శ్రమను ప్రేమించడమేనని చెప్పారు. ఆయన అనుసరించిన బాటలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ.. ప్రతి క్షణం తెలుగు ఔన్నత్యం కోసం పాటుపడాలని కోరారు. తెలుగు భాష సజీవమని, ఎల్లప్పుడు తేజస్వీగా నిలుస్తుందని చెప్పారు. మధు మాట్లాడుతూ... ప్రజల దైనందిన వ్యవహారిక భాషగా తెలుగు భాష ఉండాలని, దృఢ సంకల్పంతో చిత్తశుద్ధితో తెలుగు భాషోద్యమానికి గిడుగు రామమూర్తి పంతులు తన జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. ఆనాడు సమాజంలో ఉన్న అనేక మంది పండితులు ఆయనపై దాడులకు దిగినా వెనుకంజ వేయకుండా మొక్కవోని దీక్షతో ప్రజా భాషగా తెలుగు ఉండాలని భాషాభివృద్ధి కోసం కృషి చేశారని వివరించారు. సామాజిక విలువల కోసం జీవితాంతం కట్టుబడి పని చేశారని అన్నారు. భాషాభివృద్ధి కోసమే కాక, ఆనాడు సమాజంలో వెనుకబడిన సవరల (గిరిజనుల) భాషకు ఒక లిపిని కనిపెట్టి, దాని అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి మురళీకృష్ణ, బాధ్యులు టి. క్రాంతికిరణ్, కె స్వరూపరాణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు. తెలుగు ఔన్నత్యం, దాని విశిష్టతపై పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, అనిఫ్ గేయాలాలపించారు. ముందుగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి శివరామకృష్ణమూర్తి, మధు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు చెక్కు అందజేస్తున్న అంగన్‌వాడీలు

కేరళ వరద బాధితుల సహాయార్థం

అంగన్‌వాడీలు రూ.4.50 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి- అమలాపురం

కేరళ వరద బాధితుల సహాయార్థం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంగన్‌వాడీలు 400 సెంటర్ల పరిధిలో ప్రజల నుండి వసూలు చేసిన రూ.4.50 లక్షలను అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి, ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మలకు చెక్కు రూపంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు వెంకటలక్ష్మి, కార్యదర్శి కృష్ణవేణి, కోశాధికారి అమూల్య, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తుండగా...

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు (నెల్లూరు)

వివాహానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. ఈ సంఘటన కర్ణాటక - ఆంధ్ర సరిహద్దు పాళ్యగేటు వద్ద గురువారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం చుంచులూరు గ్రామానికి చెందిన ఓ కుటుంబం తమ సమీప బంధువుల వివాహానికి కారులో బెంగళూరు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో కారును ఎదురుగా వస్తున్న టెంపో వాహనం పాళ్యగేటు సమీపం వద్ద ఢీకొన్నది. శ్రీనివాసులు (48), ఆయన భార్య పుష్ప (42), కుమారుడు శ్రీకాంత్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్గదర్శిపై సిఐడి కేసులు వాపస్

ప్రజాశక్తి-అమరావతి

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆర్థిక అవకతవకలు, ఇతర ఉల్లంఘనలు జరిగాయంటూ రామోజీరావు, శైలజా కిరణ్, మార్గదర్శికి చెందిన ప్రముఖులు, ఉద్యోగులపై కేసుల ఆధారంగా దాఖలు చేసిన చార్జిషీట్లను సిఐడి వాపస్ తీసుకుంది. గుంటూరు, విశాఖపట్నంలలోని డిపాజిటర్ల పరిరక్షణ చట్టం ప్రత్యేక కోర్టులు 'రిటర్న్' చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన అప్పీళ్లను కూడా ఉపసంహరించుకుంది. సిఐడి అదనపు డిజి లేఖ ఆధారంగా అప్పీళ్లను ఉపసంహరించుకుంటున్నట్లు రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం లక్ష్మీనారాయణ గురువారం హైకోర్టుకు తెలిపారు.

వీటిని రికార్డుల్లో నమోదు చేసి ఈ వ్యవహారం పరిష్కారమైనట్లుగా జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఆదేశాలు జారీ చేశారు. చార్జిషీట్లను రిటర్న్ చేస్తూ ప్రత్యేక కోర్టుల ఉత్తర్వులను హైకోర్టులో సిఐడి అప్పీల్ పిటిషన్లు వేసింది. ఇవి విచారణకు వచ్చిన సందర్భంగా కేసులను ఉపసంహరించుకున్నట్లు సిఐడి చెప్పడంతో అందుకు హైకోర్టు అనుమతినిచ్చింది.

విజయవాడ, విశాఖ మెట్రోలకు శ్రీకారం

మొదటి పేజి తరువాయి

చేశారని, దీనికోసం రూ.14,121 కోట్లు ఖర్చవుతుందని వివరించారు. విజయవాడ మెట్రో రెండుదశలకు కలిపి 66.20 కిలోమీటర్ల మేర నిర్మించే ప్రాజెక్టుకు రూ.25,130 కోట్లు ఖర్చవుతుందని నారాయణ తెలిపారు.

విశాఖ మెట్రో ఇలా

విశాఖపట్నం మెట్రోను రెండుదశల్లో నాలుగు కారిడార్లగా నిర్మించనున్నట్లు తెలిపారు. మొదటిదశలో స్టీలు ప్లాంటు నుండి కొమ్మాది వరకూ 34.40 కిలోమీటర్లు మొదటికారిడార్, గురుద్వారా నుండి ఓల్డ్ పోస్టాఫీసు వరకు 5.07 కిలోమీటర్ల మేర రెండో కారిడార్ తాటిచెట్లపాలెం నుండి చినవాల్తేరు వరకు 6.75 కిలోమీటర్ల మేర, మూడో కారిడార్ మొత్తం మొదటిదశలో 46.23 కిలోమీటర్ల మేర నిర్మిస్తామని వివరించారు. రెండోదశలో కొమ్మా ది నుండి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ 30.67 కిలోమీటర్లు నిర్మిస్తామని విశాఖ మొత్తంగా 76.90 కిలోమీటర్ల మెట్రో వస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టులకు మొదటిదశలో రూ.11,498 కోట్లు, రెండోదశలో రూ.5734 కోట్లు మొత్తంగా రూ.17,232 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. మెట్రోకు సంబంధించి కేంద్రం వద్ద నాలుగు రకాల ప్రతిపాదనలు ఉన్నాయని, విభజన చట్టం ప్రకారం మెట్రో నిర్మించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని తెలిపారు. విజయవాడకు ఇప్పటికిప్పుడు మెట్రో అవసరం లేకపోయినా రాబోయే పదేళ్లలో పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకుని మెట్రోనిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ కంట్రోల్ కోసం ప్రపంచం మొత్తం మెట్రో రైలుపై ఆధారపడిఉందని అన్నారు.

వస్తువుల పునర్వినియోగం, వ్యర్థాల నిర్వహణతో సుస్థిరాభివృద్ధి

జాతీయస్థాయి వర్క్‌షాపులో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ కార్యదర్శి లీనా నందన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్టణం)



జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో వేదికపై మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ కార్యదర్శి లీనా నందన్ తదితరులు

వస్తువుల పునర్వినియోగం, వ్యర్థాల నిర్వహణతో సుస్థిర అభివృద్ధి సాధ్యమమవుతుందని, సరికొత్త ఆర్థిక ఫలాలు చేకూరుతాయని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ కార్యదర్శి లీనా నందన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని కోరారు. 4వ చీఫ్ సెక్రటరీస్ జాతీయ కాన్ఫరెన్స్‌లో భాగంగా గురువారం విశాఖలోని నోవొటెల్ హోటల్లో నిర్వహించిన 'సర్క్యులర్ ఎకానమీ - పాలసీ టు ఇంప్లిమెంటేషన్' జాతీయ వర్క్ షాపునకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యకలాపాలపై, తీసుకోవాల్సిన నిర్ణయాలపై ఆచరణాత్మకమైన ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేస్తే ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. ఉత్పత్తుల వినియోగం, రీసైక్లింగ్, రీయూజ్ అనే కాన్సెప్ట్‌లపై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని, వ్యర్థాల నిర్వహణపై యువతకు శిక్షణ ఇప్పించాలని, సర్టిఫికేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్థానిక సంస్థలను భాగస్వామ్యం చేస్తూ వస్తువుల పునర్వినియోగం, వ్యర్థాల నిర్వహణ కొనసాగించాలని, ఎక్కడికక్కడ రీసైక్లింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను అడాప్ట్ చేసుకోవాలని అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ అదనపు కార్యదర్శి నరేష్ పాల్ గాంగ్వార్ మాట్లాడుతూ ప్రస్తుత విధానాల్లో ఉన్న అంతరాలను గుర్తించి సరిచేయాలని, ఉత్తమ విధానాలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ) అనంత రాము మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో సన్ రైజ్ సెక్టార్లకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా ఆశించిన ఫలితాలు సాధించాలని అన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ టాప్ స్థానంలో నిలుస్తుందని పేర్కొన్నారు. జివిఎంసి కమిషనర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ గ్రేటర్ మున్సిపాలిటీ పరిధిలో వ్యర్థాల నిర్వహణ, వస్తువుల పునర్వినియోగంలో ఆధునిక పద్ధతులను అవలంభిస్తూ ఉత్తమ ఆర్థిక ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఔత్సాహికులకు చేయూత, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, డెమోగ్రాఫిక్ డివిడెండ్, వ్యర్థాల నిర్వహణ, వస్తువుల రీసైక్లింగ్, పునర్వినియోగం తదితర అంశాలపై ఈ వర్క్‌షాపులో సుదీర్ఘంగా చర్చించారు. దేశంలోని అన్ని కేంద్రపాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి అధికార ప్రతినిధులు వ్యర్థాల నిర్వహణకు అవలంభిస్తున్న విధానాలకు సంబంధించి 51 అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. బ్యాటరీ, వాహన, తుక్కు, మైనింగ్, ప్లాస్టిక్, పాత టైర్లు, ఎలక్ట్రానిక్ వేస్టు, వినియోగించిన ఆయిల్, సోలార్ వేస్టు, లిక్విడ్ వేస్టు, నిర్మాణాల కూల్చివేత తదితర ప్రక్రియల్లో వచ్చే వ్యర్థాల నిర్వహణపై సమగ్ర వివరాలను అందించారు.

ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, సాధిస్తున్న ఫలితాలను వివరించారు. సదస్సులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉన్నతాధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబానీని దాటేసిన అదానీ

- హురున్ ఇండియా 'కుబేరుల జాబితా' వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత కుబేరుడిగా గౌతం అదానీ నిలిచారు. ముకేష్ అంబానీ తొలి స్థానం నుంచి రెండోస్థానానికి పడిపోయారు. దేశంలో అత్యంత సంపన్నుల జాబితాను హురున్ ఇండియా గురువారం విడుదల చేసింది. అందులో 62 ఏళ్ల గౌతమ్ అదానీ రూ.11.6 లక్షల కోట్ల సంపదతో మొదటి స్థానంలో ఉన్నారు. ముకేష్ అంబానీ రూ.10.1 లక్షల కోట్ల సంపద కలిగి ఉన్నారు. ఈ జాబితాలో తొలిసారి బాలివుడ్ నటుడు షారుఖ్‌ఖాన్‌కు చోటు దక్కింది. ఆయన రూ.7,300 కోట్ల సంపద కలిగి ఉన్నారు. శివ్ నాడార్, కుటుంబం రూ.3.1 లక్షల కోట్లతో 3వ స్థానంలో, సైరస్ పునావాలా కుటుంబం రూ.2.89 లక్షల కోట్లు (4), దిలిప్ సింఘ్వీ రూ.2.49 లక్షల కోట్లు (5), కుమార్ మంగళం బిర్లా రూ.2.35 లక్షల కోట్లు (6), గోపిచంద్ హిందుజా కుటుంబం రూ.1.92 లక్షల కోట్లు (7), రాధాకృష్ణ దమాని రూ.1.90,900 కోట్లు (8), అజీమ్ ప్రేమ్‌జీ కుటుంబం రూ.1.90,700 కోట్లు (9), నిరజ్ బజాజ్, కుటుంబం రూ.1.62 లక్షల కోట్లు (10) సంపదతో వరుస స్థానాల్లో నిలిచారు.

రేపు సిఎం గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీవెన్స్ కార్యక్రమం రద్దయింది. టిడిపి కార్యాలయంలో ప్రతి శనివారం ప్రజావేదిక పేరుతో ప్రజల నుంచి ఆయన వినతులు తీసుకుంటున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో సామూహిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒకరోజు ముందుగానే నిర్వహించనున్న నేపథ్యంలో కార్యక్రమం రద్దయిందని టిడిపి కార్యాలయం కార్యదర్శి పి అశోక్‌బాబు తెలిపారు. ఈ శనివారం ఎటువంటి గ్రీవెన్స్ ఉండదని వెల్లడించారు.

జలవనరులశాఖ సలహాదారుగా కన్నయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర జలవనరులశాఖ ప్రభుత్వ సలహాదారుగా రిటైర్డు ఇంజినీరు, గేట్ల నిర్వహణ నిపుణులు కన్నయ్య నాయుడును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల తుంగభద్ర డ్యామ్ గేట్ వరదల్లో కొట్టుకుపోయినప్పుడు డ్యామ్‌లో నీరు వున్నా గేట్ స్థానంలో స్టాప్‌లాగ్ పెట్టి నీటి వృథాను అరికట్టడంలో విజయవంతం కావడం వెనుక కన్నయ్య నాయుడు కృషి వుంది. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పరిశీలనకు కన్నయ్య నాయుడును సలహాదారుగా నియమించింది. గత ఐదేళ్ల కాలంలో పులిచింతల ప్రాజెక్టు, గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. అలాగే అన్నమయ్య, పింఛా, పెదవాగు ప్రాజెక్టులు వరదలకు కొట్టుకుపోయాయి. భవిష్యత్‌లో ప్రాజెక్టుల నిర్వహణ పర్యవేక్షణకు సలహాదారుగా వుండేందుకు ప్రభుత్వం కన్నయ్య నాయుడును జలవనరులశాఖకు సలహాదారుగా నియమించింది.

ప్రత్యేక హోదా కోసం పిల్

ప్రజాశక్తి-అమరావతి

లోక్‌సభలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులివ్వాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కెఎ పాల్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ఆదుకునేలా చేయాలని, రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుకు వీలుగా అన్ని పన్ను మినహాయింపులు, రాయితీలు ఇచ్చేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 2014 ఎన్నికల ప్రచారానికి వచ్చిన మోడీ తిరుపతిలో ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీ ఆయన ప్రధాని అయ్యాక కూడా అమలు కాలేదన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆసక్తి చూపడం లేదన్నారు. ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు. కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీని వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా పేర్కొన్నారు.

కార్మికుల ప్రాణాలకు రక్షణేది?

- భద్రత పాటించని యాజమాన్యాలు
- విశాఖ కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా



కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-సీతమ్మధార (విశాఖపట్నం)

పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, భద్రత పాటించని యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని కోరుతూ వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన విశాఖ అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్ అచ్యుతరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ఎఐఎఫ్‌టియు కార్యదర్శి గణేష్ పాండా మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు నిత్య కృత్యమయ్యాయన్నారు. పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇటీవల ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో ఐదుగురు చనిపోవడం మరవకముందే అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం సెజ్‌లోని ఎసెన్సియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 17 మంది, ఆ తరువాత రోజే పరవాడలో సినర్జీయన్ కంపెనీలో నలుగురు తీవ్రగాయాలపాలై ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. లాభాలే పరమావధిగా యజమానుల ఉంటున్నాయి తప్ప కార్మికుల ప్రాణాలకు విలువ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలంలో 120 ప్రమాదాలు జరిగితే 121 మంది కార్మికులు చనిపోయారని ప్రభుత్వమే నివేదిక అందజేసిందని గుర్తుచేశారు. పరిశ్రమలలో తనిఖీలు చేయనవసరం లేదని, యాజమాన్యాలు సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని గతంలో చంద్రబాబు ప్రభుత్వం జిఒ 64 తీసుకొచ్చినప్పటి నుంచి పరిశ్రమలలో తనిఖీలు జరగడం లేదన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో పరిశ్రమలకు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం చట్టాలను గాలికి వదిలేయడమేనని అన్నారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ బిజినెస్ పేరుతో ఇంకా స్వేచ్ఛగా యాజమాన్యాలకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారని, ఇటువంటి విధానాల వల్లే కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలతో కలిసి ప్రమాదాల నివారణపై పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని తెలిపారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం సుబ్బారావు, పి.వెంకట్రావు, ప్రకాశరావు, చంద్రశేఖర్, శివ, ఎఐటియుసి నాయకులు వామనమూర్తి, బి.వెంకట్రావు, సత్యాంజనేయ, సత్యనారాయణ, కాసుబాబు, ఐఎఫ్‌టియు నాయకులు మల్లన్న, తిరుపతిరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎఐ డెస్టినేషన్‌గా విశాఖ : మంత్రి లోకేష్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)


మీడియాతో మాట్లాడుతున్న లోకేష్

విశాఖను ప్రపంచ స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. గతంలో ఆయనపై సాక్షి దినపత్రికలో ప్రచురించిన "చినబాబు చిరు తిండి ఖర్చు రూ.25 లక్షలు" అన్న కథనంపై చేస్తున్న న్యాయ పోరాటంలో భాగంగా గురువారం ఆయన విశాఖపట్నంలోని 12వ అదనపు మెట్రోపాలిటన్ కోర్టులో హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలో ఆనాడు వైజాగ్ ఎయిర్‌పోర్టులో తాను తీసుకున్న టీ, కాఫీ ఖర్చులకు రూ.25 లక్షల బిల్లు అయిందని, దానిని కట్టేందుకు ప్రభుత్వం తీవ్ర ఇబ్బంది పడుతుందని సాక్షిలో కథనాలు ప్రచురించారని, ఆ తర్వాత ఢిల్లీకి చెందిన వీక్ అనే వారపత్రిక కూడా ఇటువంటి కథనాలు ప్రచురించిందని, ఈ కథనాలపై వెంటనే స్పందించి అన్ని సాక్షాలతో వివరాలు వెల్లడించానని తెలిపారు. అనంతరం వీక్ పత్రిక రిజైన్డర్ ద్వారా తమ కథనాలను వెనక్కి తీసుకుందని, సాక్షి పత్రిక మాత్రం ఆనాటి తప్పుడు కథనాలకు నేటికీ వంత పాడుతూనే ఉందని తెలిపారు. ఈ క్రమంలోనే సాక్షి పత్రికపై రూ.75 కోట్లకు డెఫర్మేషన్ సూట్ వేశానని, అందుకోసం రూ.75 లక్షల కోర్టు ఫీజు కూడా చెల్లించానని చెప్పారు. గతంలో మంత్రిగా ఉన్నప్పుడు, ఇప్పుడు కూడా సొంత ఖర్చులన్నీ తానే స్వయంగా భరిస్తున్నానని, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని తెలిపారు. ఈ ఒక్క కథనమే కాకుండా సొంత బాబాయిని జగనే లేపేసి "నారాసుర రక్త చరిత్ర" అని కథనాలు ప్రచురించారని ఇటువంటి అసత్య ప్రచారాన్ని అడ్డుకునేందుకే న్యాయపోరాటానికి దిగానని చెప్పారు. ఈ కేసు అక్టోబర్ 18వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు. చంద్రబాబు ఒక బ్రాండ్ అని, ప్రమాణ స్వీకారం జరిగిన నాటి నుంచి పలు ప్రపంచ స్థాయి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయని తెలిపారు. త్వరలోనే రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తెచ్చేందుకు ఐటి శాఖ మంత్రిగా చర్యలు చేపడతానన్నారు.

ఆత్మాభిమానానికి ప్రతిరూపం హరికృష్ణ : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిండైన, ఆత్మీయతకు, ఆత్మాభిమానానికి ప్రతిరూపం నందమూరి హరికృష్ణ అని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. హరికృష్ణ 6వ వర్ధంతి సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో గురువారం నివాళులర్పించారు. పొలిట్‌బ్యూరో సభ్యులుగా, మంత్రిగా, శాసనసభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా తెలుగు ప్రజలకు హరికృష్ణ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

టిడిపి కార్యాలయంలో నివాళులర్పించిన నేతలు

టిడిపి కార్యాలయంలో హరికృష్ణ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఎంఎస్‌ఎంఇ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్.. హరికృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రామారావు, పార్టీ నాయకులు ఎవి రమణ, బుచ్చి రామ్‌ప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సంప్రదించి కౌలు చట్టం రూపకల్పన

- కౌలు రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కౌలు రైతులతో క్షేత్రస్థాయిలో సంప్రదించి రాష్ట్ర ప్రభుత్వం కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, సీనియర్ నాయకులు వై కేశవరావు, కౌలు రైతు సంఘం నాయకులు పి రంగారావు, సిహెచ్ సైదులు గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టం తయారీలో కీలకంగా ఉన్న అధికారులు కౌలు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో కౌలు రైతులతో సమావేశాలు జరిపి అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులే ఎక్కువగా వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారని చెప్పారు. పెట్టుబడులు, కౌలు విపరీతంగా పెరిగాయని తెలిపారు. రిజర్వు బ్యాంక్ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలివ్వాలని చెబుతున్నప్పటికీ కిందిస్థాయిలో బ్యాంకుల నుంచి కౌలు రైతులకు రుణాలు అందటం లేదని పేర్కొన్నారు. భూ యజమాని అనుమతి లేకపోతే కౌలు గుర్తింపు కార్డులు రావడం లేదని, ఫలితంగా ఇ-పంట నమోదు కాకపోవడంతో పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి పథకాలు అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల కష్టాలు భరించలేక కౌలు రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన సర్టిఫికెట్లు లేకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియో కూడా కుటుంబ సభ్యులకు రావడం లేదని పేర్కొన్నారు. భూ యజమాని అనుమతి, సంతకం నిబంధన తొలగించి గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు అందించాలని, వీటి పూచికత్తుపై రూ.1.6 లక్షల వరకు వడ్డీలేని రుణం ఇవ్వాలని కోరారు. ఈ కార్డులతో సంబంధం లేకుండా ఇ-పంట నమోదు చేయాలన్నారు. కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం ప్రతి కౌలు, సాగుదారుడికి కులాలతో సంబంధం లేకుండా తప్పనిసరిగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ముందస్తు క్యాష్ కౌలు విధానం రద్దు చేయాలని కోరారు. విత్తనాలు, ఎరువులు 50 శాతం సబ్సిడీకి కౌలు రైతులకు కూడా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం ఇచ్చే పరికరాలు 90 శాతం సబ్సిడీతో అందించాలని కోరారు. కౌలు రైతులకు స్థానిక, ప్రాథమిక పరపతి సంఘాల్లో సభ్యులుగా చేరుకోవాలని, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వాలని పేర్కొన్నారు. 50 ఏళ్లు దాటిన ప్రతి కౌలు రైతుకూ రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. భూ యజమానితో ఎటువంటి అంగీకార, ఒప్పందం లేకుండా గ్రామ సభల ద్వారా సాగు, కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.


వినతిపత్రం సమర్పిస్తున్న డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు

నెల్లూరులో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- డివైఎఫ్ఐ, ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలో ప్రజలను పట్టిపీడిస్తున్న విష జ్వరాల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా సంతపేట ప్రాంతంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టరు ఎం పెంచలయ్య, జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మను ఆయా సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో నాయకులు మాట్లాడుతూ గత నెల రోజులుగా విష జ్వరాలు నగరవాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని, వీటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మెడికల్ క్యాంపు నిర్వహించి, మందులు పంపిణీ చేయాలని కోరారు. నగర జనాభాకి తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులు లేకపోవడం వల్ల పారిశుధ్యం లోపించే సైడ్ కాలువల్లో చెత్తాచెదారాలు పెరిగిపోయి దోమలు ఎక్కువయ్యాయన్నారు.


దీంతో జ్వరాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు సైడ్ కాలువల్లో ఆయిల్ బాల్స్ గంబూచియా చేప పిల్లలు, ఫాగింగ్ చేయడం బ్రేటెక్స్ ఆయిల్ స్ప్రే చేయడం లాంటి దోమల నివారణ చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రయివేట్ వైద్యశాలలకు వెళ్తున్న రోగులను దోచుకుంటున్న ప్రయివేట్ ఆస్పత్రుల్లపైన, ల్యాబ్‌లపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ, నగర్ కార్యదర్శి పద్మ, డివైఎఫ్ఐ నాయకులు తిరుపతి, జగదీష్, సురేంద్ర, శేఖర్, పవన్, సుబ్బరాయుడు, షాహినా, మల్లేశ్వరి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలకు బెదరం

- మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన సహజ వైఖరితో మరోసారి రాజకీయ కుట్రలకు తెరలేపారని మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావును కొనుగోలు చేసి రాజకీయ బేరసారాలు మొదలుపెట్టారని విమర్శించారు. తమ పార్టీలో చేరాలనుకునేవారు పదవులకు రాజీనామా చేసి రావాలని చెబుతున్న చంద్రబాబు 2014 నుంచి 2019 మధ్య 23 మందితో ఎందుకు రాజీనామా చేయించకుండా పార్టీలో చేర్చుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎంత మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మేయర్‌లతో రాజీనామా చేయించి పార్టీలో చేర్చుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ కూడా చంద్రబాబులా కుట్ర రాజకీయాలు చేసి వుంటే 2019లో గెలిచిన టిడిపి ఎమ్మెల్యేలు ఒక్కరూ ఆ పార్టీలో వుండేవారు కాదన్నారు. 2029 నాటికి జగన్ నాయకత్వంలో వైసిపి మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. అలాగే తమను కేసులతో ఇబ్బందులు పెట్టారని ఐపిఎస్ అధికారులపై కక్ష తీర్చుకునేందుకు సినీ నటిని అడ్డం పెట్టుకుని డ్రామాలాడుతున్నారని అన్నారు.



కేంద్రానికి రూ.3,662 కోట్ల ఎల్ఐసి డివిడెండ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) కేంద్రానికి రూ.3,662.17 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసి సిఇఒ, ఎండి సిద్దార్థ మోహంతి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం అందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ డివిడెండ్‌ను ప్రకటించింది. ఆగస్టు 22న జరిగిన ఎల్ఐసి వార్షిక జనరల్ బాడీ మీటింగ్‌లో దీనికి ఆమోదం తెలిపారు. ఎల్ఐసిలో కేంద్రానికి ప్రస్తుతం 96.50 శాతం వాటా ఉంది.

సంపాదకీయం

మహిళలకు గౌరవం, రక్షణ

మలయాళ చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులపై జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో- సినిమా రంగంలోని మహిళలకు గౌరవమూ, రక్షణ చేకూర్చే చర్యలపై మరొకసారి చర్చ జరుగుతోంది. అవకాశాల కోసం పోటీ పడే ఈ రంగంలో ఆ అభిలాషనే ఆసరాగా తీసుకొని కాస్టింగ్ కౌచ్‌కు పాల్పడుతున్న సంఘటనలపై చాలాకాలంగా నిరసన వ్యక్తమవుతోంది. 2006లో బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ ... ఇలా అన్ని చోట్లా పెద్దఎత్తున మీటూ ఉద్యమం జరిగింది. తమకు ఎదురైన లైంగిక వేధింపులపై ఎందరో బాధిత మహిళలు గొంతెత్తారు. ఆ తరువాత, అంతర్గత ఫిర్యాదుల కమిటీల ఏర్పాటు వంటివి తప్ప దాదాపుగా ఏ పరిశ్రమలోనూ విచారణ జరపలేదు, ఎలాంటి నిర్దిష్ట చర్యలూ చేపట్టలేదు.

కేరళలో 2017 ఫిబ్రవరిలో భావన అనే నటిపై కారులోనే కొందరు లైంగిక దాడికి ప్రయత్నించటం, ఆమె తప్పించుకొని రెండోరోజు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిన నేపథ్యంలో- చిత్ర పరిశ్రమలో జరుగుతున్న లైంగిక వేధింపులపై పలువురు స్పందించారు. విమెన్ వింగ్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యుసిసి) ఏర్పడి, ముఖ్యమంత్రి పినరన్ విజయ్‌కు వినతిపత్రం ఇచ్చారు. వామపక్ష ప్రభుత్వం వెంటనే స్పందించి, హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ కె.హేమ నేతృత్వాన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ముందుకు నేరుగా వచ్చి మాట్లాడటానికి కొంతమంది వెనకాడుతున్నారని తెలిశాక- ఫిర్యాదుదారుల వివరాలు, విషయాలూ ఎట్టి పరిస్థితుల్లోనూ బయటపెట్టబోమని, ఏ రూపంలోనైనా తమకు వాంగ్మూలాలు అందజేయవచ్చునని జస్టిస్ హేమా కమిటీ ప్రకటించింది. ఎక్కువమందిని కలవటానికి, వారి ఫిర్యాదులు నమోదు చేయటానికి ప్రాధాన్యం ఇచ్చింది. రెండేళ్ల పాటు విచారణ జరిపి, 2019 డిసెంబరు 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఆ నివేదికను బయటపెట్టమని కొందరు డిమాండు చేయగా- అంశాల్లోని సున్నితత్వం, ఫిర్యాదుదారుల గోప్యత తదితర కారణాల వల్ల నివేదిక బహిరంగ వెల్లడికి జస్టిస్ హేమ కమిటీ ఒప్పుకోలేదు. సున్నిత అంశాలను మినహాయించి, మిగతా అంశాలను వెల్లడించాల్సిందిగా ఇటీవల హైకోర్టు ఆదేశించటంతో ఆగస్టు 17న ఈ నివేదిక బహిర్గతమైంది.

జస్టిస్ హేమా కమిటీ ఈ నివేదికలో అనేక అంశాలను ప్రస్తావించింది. మలయాళ సినిమా పరిశ్రమలో కొంతమంది మగ దర్శకుల, నటుల పెత్తనం సాగుతోందని; ప్రశ్నించేవారిపై అనధికార నిషేధం కొనసాగుతోందని; మహిళా నటులపై లైంగిక వేధింపులు సాగుతున్నాయని; సర్దుకుపోవడం, రాజీపడడం అనేది ఒక సూత్రంగా అమలు చేయబడుతోందని వివరించింది. జూనియర్ నటుల పట్ల తీవ్రమైన వివక్ష ఉందని, పని ప్రదేశాల్లో బట్టలు మార్చుకోవటానికి కానీ, కాలకృత్యాలు తీర్చుకోవటానికి కానీ తగిన ఏర్పాట్లు ఉండడం లేదని పేర్కొంది. చిన్న నటులతో రాతపూర్వక ఒప్పందాలు ఉండడం లేదని, ఎక్కువ పని చేయించుకొని తక్కువ వేతనాలు ఇస్తున్నారని తెలిపింది. ఈ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సూచించింది. నాలుగేళ్ల క్రితం నివేదిక తనకు అందిన నాటి నుంచి సినీ పరిశ్రమలో మహిళలకు రక్షణ చర్యలను ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం చేపట్టింది. నిర్మాతల మండలితో, దర్శకులతో సంప్రదింపులు జరిపి, షూటింగ్ ప్రదేశాల్లో మహిళలకు తగు సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకొంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే ప్రధాన ఉద్దేశంగా ఉన్న కొన్ని శక్తులు ఈ నివేదికలోని సున్నితాంశాలపై రచ్చ చేస్తున్నాయి. పరిస్థితిని చక్కదిద్దటానికి, మహిళల ఆత్మగౌరవం కాపాడ్డానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే కమిటీ వేసి విచారణ జరిపించామని ముఖ్యమంత్రి పినరన్ విజయన్ మరోసారి స్పష్టం చేశారు.

కేరళ సమాజంలో నెలకొని ఉన్న చైతన్యపూరిత వాతావరణం సినీ పరిశ్రమలోనూ ప్రతిబింబిస్తూ ఉంటుంది. హక్కుల పట్ల, ఆత్మగౌరవం పట్ల తగినంత ఎరుకను అక్కడి నటీనటులు ప్రదర్శిస్తారు. మీటూ ఉద్యమం జరిగినా దేశవ్యాప్తంగా ఎక్కడా ఏ ప్రభుత్వమూ ఎలాంటి కమిటీలను వేసి, విచారణ జరపలేదు. కేరళలో మాత్రమే అలాంటి ప్రయత్నం జరిగింది. జస్టిస్ హేమా కమిటీ నివేదికలో పేర్కొన్న పరిస్థితులు అన్ని సినీ పరిశ్రమల్లోనూ నెలకొని ఉన్నాయి. నటీనటులకు సమాన గౌరవం, జూనియర్ నటులకు తగు సదుపాయాల కల్పన, పారితోషికాల్లో తీవ్ర వ్యత్యాసాల నివారణ వంటివి ప్రయత్నపూర్వకంగా అన్ని సినీ పరిశ్రమల్లోనూ కల్పించాల్సి ఉంది. కేరళ వలె ప్రభుత్వాలు అన్నిచోట్లా విచారణ, అధ్యయనం జరిపించి, తగు చర్యలు తీసుకోవాలి.

మహనీయుల మాట




ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగం తోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

విశ్లేషణ

నెత్తుటి మరకల చరిత్ర ఇది

(23.8.24 వ్యాసం తరువాయి)



ప్రబీర్ పురకాయస్థ

అమెరికాను కనుగొన్నది యూరోప్. కానీ స్థానిక అమెరికన్ ఆదివాసుల జాతి హననానికి కారణం ఈ యూరోపియన్ ఆక్రమణదారులే. ఈ ఆక్రమణల వల్ల అమెరికా సమాజాల ఉత్పత్తి వ్యవస్థలు దెబ్బ తిని, జబ్బులు ప్రబలి లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. బొలీవియా లోని పోటోసి వెండి గనుల్లోని బానిసత్వపు పరిస్థితులు దారుణంగా ఉండేవి. భూగర్భంలో గంటల కొద్ది గడపాల్సి వచ్చేది. పైగా అక్కడ దారుణమైన వేడి ఉండేది. వీటి వల్ల 20-80 లక్షల మధ్య చనిపోయి ఉంటారని ఒక అంచనా.

ఆఫ్రికా నుండి బానిసల రవాణా

ఈ పరిస్థితుల్లో, స్థానికులు చాలక, ఆఫ్రికా నుంచి కూడా బానిసల్ని దిగుమతి చేసుకునేవారు. ఇందుకు యూరోపియన్లు వాళ్లలో వాళ్లు ఒప్పందాలు చేసుకునేవారు. ఆఫ్రికా ఖండం పోర్చుగీసు వారికి చెందుతుందని ఒక ఒప్పందం ఉండేది. ఆఫ్రికా నుంచి బానిసలను దిగుమతి దిగుమతి చేసే కాంట్రాక్టు పోర్చుగీసు వారిదన్న మాట. డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ వ్యాపారులందరికీ, తరువాత తరువాత ఇదే మార్గదర్శకమైంది.

ఓడల్లో ఈ బానిసలను, ఆఫ్రికా నుండి రవాణా చేసేప్పుడు మధ్యలో మజిలీలు అవసర మయ్యేవి. అందుకోసం పోర్చుగీసు వారు ఘానాలో, ఒక కోటను కూడా నిర్మించారు. దీన్ని డచ్ వారు ఆక్రమించు కున్నాక, దాన్ని అంగోలాకు మార్చుకున్నారు. కరేబియన్, బ్రెజిల్ దేశాలలో ప్రారంభమైన చక్కెర, కాఫీ, పొగాకు, కోకో లాంటి పంటలు పండించడానికి కూడా బానిసలు అవసరమయ్యారు. బానిసల డిమాండ్ పెరుగుతూ వచ్చింది. గనుల్లో, కంటే, ఈ పంట తోటల్లో బానిసల గిరాకీ ఎక్కువ. పాశ్చాత్యుల పెత్తనానికి వెండి, చక్కెరలతో పాటు బానిసల బలవంతపు చాకిరి కూడా పునాది అయ్యింది. ఇదంతా పారిశ్రామిక విప్లవం రావడానికి రెండున్నర శతాబ్దాలకు ముందేనని గుర్తుపెట్టుకోవాలి.

ఈ విధంగా ఆఫ్రికాలో బానిసలుగా పట్టుకొని పళ్ళ తోటలకు రవాణా చేయబడిన వారు ఎంతమంది ఉంటారు? 16వ శతాబ్దంలో 30 లక్షల మంది, 17వ శతాబ్దంలో, 60 లక్షల మంది, 18వ శతాబ్దంలో మరో 30 లక్షల మంది ఉంటారు. అంటే మొత్తం ఒక కోటి 20 లక్షలు అన్నమాట. అంతేకాక, భారతదేశం, చైనా నుండి వెస్టిండీస్ ఈస్టిండీస్ తోటల్లో. పని చేయడానికి తీసు కొచ్చిన వారు ఇంకా ఎందరో?



దీని పర్యవసానాలు ఆఫ్రికాలో తీవ్రంగా ఉన్నాయి. ఆఫ్రికా జనాభా పెరగడం ఆగిపోయింది. వయసులో ఉన్న యువతీ యువకులను పెద్ద ఎత్తున ఆఫ్రికా నుండి రవాణా చేయడం దీనికి కారణం. ఆసియాలో, యూరోప్‌లో జనాభా బాగా పెరుగుతూ ఉంటే, ఆఫ్రికాలో ఆగిపోయింది. ప్రధాన సరుకు...వెండి, చక్కెర, బానిస కానీ, అమెరికాలో అభివృద్ధి అయిన పంట తోటల ఆర్థిక వ్యవస్థకు పునాది వేసింది ఈ బానిస లు చేసిన శ్రమే.

యూరోపియన్లకు చెరుకు గురించి, క్రూసేడుల సమయంలో అరబ్బుల నుండి తెలిసింది. తెలుసుకున్న తర్వాత, చెరుకు పంటలతో ప్రయోగం మధ్యధరా దీవుల్లో చేశారు. ఆ తర్వాత స్పెయిన్, పోర్చుగల్ దేశాలకు చెరుకు ను చేర్చారు. అట్లే ఆఫ్రికా తీరానికి, అక్కడి నుంచి బ్రెజిల్, ఆ తర్వాత బ్రిటిష్ కరీబియన్ దీవులకు, ఫ్రెంచ్ కరీబియన్ దీవులకు తీసుకుపోయారు. ఈ కరీబియన్ పంటతోటల ఆర్థిక వ్యవస్థ వల్ల చక్కెర ఒక ప్రపంచ సరుకుగా మారింది. చక్కెర, వెండి తర్వాత ప్రధానమైన సరుకుగా మారింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేసింది. మరోవైపు, అమెరికా దక్షిణాన ఉన్న బానిసలు ఉత్పత్తి చేసిన పత్తి ఇంగ్లాండులో వస్త్ర విప్లవానికి కారణమైంది. కానీ, ఆఫ్రికా నుండి తెచ్చుకున్న బానిసలను, ఒక సరకు లాగే చూశారు. వారు లాభనష్టాల చిట్టాలో భాగం మాత్రమే. ఈ విషయాలను దాచి పునరుజ్జీవం, వైజ్ఞానిక విప్లవం ద్వారా పారిశ్రామిక విప్లవం వచ్చిందని, దాన్నుంచి పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భవించింది అని వల్లిస్తూ ఉంటారు.

అయితే, ఈ యూరోపియన్ దేశాలు, ఆఫ్రికా నుండి బానిసల్ని ఎలా తెచ్చుకోగలిగాయి? మొదట్లో ఆక్రమించిన స్పానిష్ అమెరికన్ గనుల నుంచి తవ్విన వెండితో బానిసలను కొన్నారు. తుపాకులతో లొంగదీసుకున్నారు. తుపాకులు, తుపాకి మందు, వస్త్రాలు, సుగంధద్రవ్యాల వ్యాపార వ్యవహారాలు చేశారు. తద్వారా బానిసల కొనుగోలు మాత్రమే కాదు, ఒక విధంగా ఆఫ్రికాలో బానిసల ఉత్పత్తికి రంగం సిద్ధం చేశారు. బ్రిటిష్, డచ్, ఫ్రెంచ్ పెట్టుబడి అంతా ఇటువంటిదే. బానిసల ద్వారా సరుకులను ఉత్పత్తి చేయడం మాత్రమే కాదు, మనుషుల్నే సరుకులుగా మార్చి వేయడం.

బానిసలు ఎదుర్కొనే క్రూరత్వంపై ఎంతో సాహిత్యం అమెరికాలో వచ్చింది. ఒక బానిస, దాదాపు ఏడు సంవత్సరాలు చాకిరి చేసిన తర్వాత, అతన్ని వదిలించుకుంటారు. ఆ స్థానంలో మరో కొత్త బానిసను పెట్టుకుంటారు. చిన్నపిల్లలు నాలుగైదు సంవత్సరాల పసి వయసు నుండే, తల్లిదండ్రులతోపాటు, తోటల్లో పని చేస్తారు. ఒక బానిస చేసే శ్రమను, లాభనష్టాలను పక్కాగా బేరీజు వేసుకుంటారు. ఒక బానిస మీద ఎంత ఖర్చవుతుందో, ఎంత గిట్టుబాటు అవుతుందో లెక్కలు వేసుకుంటారు. ఆ బానిస నుంచి పెద్దగా లాభాలు రావడం లేదు అనుకున్నప్పుడు, అతన్ని తొలగించి కొత్త బానిసను తెచ్చుకుంటాడు. ఒక క్యాపిటలిస్టు యంత్రాల మీద, తరుగును లెక్కేసినట్టన్న మాట.

> **ఆఫ్రికాలో బానిసలను కొనుగోలు చేయడానికి అవసరమైన 30-50 శాతం డబ్బు ఇండియా వస్త్రాల నుండి చేకూరింది. తుపాకి మందులో వాడే ప్రధాన రసాయనం, దానికి అయ్యే ఖర్చు కూడా బెంగాల్-బీహార్ నుండి వచ్చింది. అప్పటికి చక్కరే ప్రధాన వాణిజ్య సరుకు. అప్పటికింకా పారిశ్రామిక విప్లవం జరగలేదు. క్యాపిటలిజం అంటే మహా వికాసమని, వైజ్ఞానిక శాస్త్రమని, పారిశ్రామిక విప్లవమని, పాశ్చాత్య దేశాలు మనకు చరిత్ర చెబుతాయి. అదే నమ్మమంటారు. కానీ ఇది, రక్తం నుంచి, స్వేదం నుంచి చిప్పిల్లిన చరిత్ర. మార్క్స్ అన్నదదే.**

భారత్, చైనాల పాత్ర....

16-18 శతాబ్దాల మధ్య జరిగిన, ఈ విధమైన వాణిజ్య ప్రపంచీకరణ వల్ల పాశ్చాత్య దేశాలు కొల్లగట్టిన వెండి, చైనా భారతదేశాలకు చేరింది. సిల్కు పింగాణి సుగంధ ద్రవ్యాలు, పత్తి లాంటివి కొనడానికి ఈ వెండిని యూరోప్ వాడింది. తూర్పు దేశాల వ్యాపారానికి, స్పానిష్ వెండి పునాదిగా ఉంది. ఇక, డచ్, ఫ్రెంచ్, బ్రిటిష్ బానిసలతో కరీబియన్ తోటల్లో, చక్కెరను పండించి, ప్రపంచ మార్కెట్లో అమ్ముకొన్నాయి. బానిసల సరఫరా కాంట్రాక్టులు కూడా చేసి వ్యాపారం చేసుకున్నారు. వెస్టిండీస్, మారిషస్ చెరుకు తోటల్లో, బ్రిటన్, ఈస్ట్ ఇండీస్‌లో డచ్ వారు భారతీయుల్ని, చైనీయుల్ని కొంచెం అటు ఇటుగా ఇదే విధంగానే వాడుకున్నారు.

ఆఫ్రికాలో బానిసలను కొనుగోలు చేయడానికి అవసరమైన 30-50 శాతం డబ్బు ఇండియా వస్త్రాల నుండి చేకూరింది. తుపాకి మందులో వాడే ప్రధాన రసాయనం, దానికి అయ్యే ఖర్చు కూడా బెంగాల్-బీహార్ నుండి వచ్చింది. అప్పటికి చక్కరే ప్రధాన వాణిజ్య సరుకు. అప్పటికింకా పారిశ్రామిక విప్లవం జరగలేదు.

క్యాపిటలిజం అంటే మహా వికాసమని, వైజ్ఞానిక శాస్త్రమని, పారిశ్రామిక విప్లవమని, పాశ్చాత్య దేశాలు మనకు చరిత్ర చెబుతాయి. అదే నమ్మమంటారు. కానీ ఇది, రక్తం నుంచి, స్వేదం నుంచి చిప్పిల్లిన చరిత్ర. మార్క్స్ అన్నదదే.

/ వ్యాసకర్త 'న్యూస్ క్లిక్' సంపాదకులు/ (స్వేచ్ఛానువాదం)

సమస్య

గిరిజన విశ్వవిద్యాలయ పనులు ప్రకటనలకే పరిమితం

కేంద్ర ప్రభుత్వం 2014లో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎ.ఐ.ఐ.ఎం.ఎస్), కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం అనే జాతీయ విద్యా సంస్థలను ఒకేసారి ఆంధ్ర ప్రదేశ్‌కు మంజూరు చేసింది. కానీ రూ. 834 కోట్లు ఎస్టిమేషన్ కలిగిన గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడ నిర్మించాలి అన్న దానిపై ఇంకా చర్చ కొనసాగుతోంది. యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు కూడా ప్రతి ఏడాది తగ్గుతున్నాయి. 2015లో రూ. 834 కోట్లు కేటాయించి మొదటి విడత కింద రూ. 420 కోట్లు విడుదల చేసింది. 2023 సంవత్సరంలో సవరించిన బడ్జెట్‌లో రూ.40.67 కోట్లు కేటాయించారు. కానీ ఖర్చు జరగలేదు. ఈ ఏడాది ఏకంగా బడ్జెట్‌లో యూనివర్సిటీకి ప్రత్యేకించి ఎటువంటి కేటాయింపులు జరగలేదు. యుజిసి నిధుల నుండి కేటాయిస్తామని చెబుతుంది. పోనీ ఆ యుజిసి నిధులేమైనా పెంచారా అంటే అదీ లేదు. గతంలో యుజిసికి రూ. 6409 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం 60.99 శాతం కోత విధించి కేవలం రూ.2500 కోట్లు కేటాయించారు. ఇందులో గిరిజన విశ్వవిద్యాలయంకు ఎంత ఖర్చు చేస్తారో వేచి చూడాలి.



భూములు సేకరించారు - బాధ్యత మరిచారు

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం విజయనగరంలో కొత్తవలస సమీపంలోని రెల్లి గ్రామంలో నిర్మించాలని గతంలో టిడిపి ప్రభుత్వం నిర్ణయించింది. 2015లో అక్కడ రైతుల నుండి 520 ఎకరాలు భూమిని సేకరించింది. కానీ దానికి రైతులకు ఎటువంటి పరిహారం చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులలో రూ. 5 కోట్లు ఖర్చు చేసి భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి చేతులు దులుపుకుంది. 'రెల్లిలో సేకరించిన భూమిలో ఎక్కువ శాతం జిరాయితీ భూమి. పరిహారం ఎక్కువ ఇవ్వాల్సి వుంటుంది. అందుకనే రెల్లి నుండి యూనివర్శిటీని మెంటాడలోని కుంతినివలస దగ్గరకు మార్చామ'ని 2019లో నూతనంగా వచ్చిన వై.ఎస్.ఆర్.సి.పి ప్రభుత్వం చెప్పింది. అక్కడ రైతుల దగ్గర నుండి 563 ఎకరాలు భూమి సేకరించి నష్టపరిహారం కూడా 90 శాతం చెల్లించింది. 4 సంవత్సరాలు పాటు కాలయాపన చేసి ఎన్నికలు వస్తున్నాయనగా హడావుడిగా కేంద్రమంత్రి ధర్మేందర్ ప్రధాన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఆ తరువాత మళ్లీ ప్రభుత్వం మారింది. 2024లో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. ఎస్.కోట ఎంఎల్‌ఏ కోళ్ల లలిత కుమారి యూనివర్సిటీ నిర్మాణం గతంలో అనుకున్న రెల్లిలోనే ఏర్పాటు చేస్తామని దానికి ముఖ్యమంత్రి, విద్యా శాఖమంత్రి కూడా ఆమోదం తెలిపారని ప్రకటించారు. ఈ మధ్య గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కుంతినివలసలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ యూనివర్సిటీ రెల్లిలో ఏర్పాటు చేస్తారని చేస్తున్న ప్రచారం వాస్తవం కాదని ఇక్కడే ఏర్పాటు చేస్తామని, అందులో ఉద్యోగాల్లో స్థానికులకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. అంతకు ముందు రోజే జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో యూనివర్శిటీ పనులు వేగవంతం చేస్తామని తెలిపారు. నీటి సరఫరాకు 4 కోట్లు, విద్యుత్ సరఫరాకు రూ.3.6 కోట్లు, రోడ్డుకు పరిహారం చెల్లించడానికి రూ.2.6 కోట్లు అవసరమౌతాయని తెలిపారు. యూనివర్శిటీ మంజూరైనప్పటి నుండి ఇటువంటి ప్రకటనలు అనేకం వస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు పని మాత్రం ముందుకు కదలడం లేదు.

సదుపాయాలు లేవు


2019 నుండి యూనివర్సిటీ ఏ.యు భవనంలో తాత్కాలికంగా తరగతులు నడుస్తున్నాయి. సుమారు 250కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. మన రాష్ట్రంతో పాటు కేరళ, కర్ణాటక, ఒడిస్సా వంటి ఇతర రాష్ట్రాల నుండి కూడా విద్యార్థులు ఇక్కడకు వచ్చి చదువుతున్నారు. వీరికి సరిపడా సదుపాయాలు లేవు. వసతి సదుపాయం లేక దగ్గరలో ఓ ప్రైవేట్ కాలేజీ హాస్టల్‌లో ఉంటున్నారు. అక్కడ రూ. 60,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. అంతంత ఫీజులు కట్టుకోలేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది విద్యార్థులు వసతి లేకపోవడంతో బయట ప్రైవేట్ హాస్టళ్లు, అద్దె గదుల్లో ఉంటూ చదువుతున్నారు. తరగతి గదులు సరిపోక పోవడంతో ఉదయం కొన్ని కోర్సులు, మధ్యాహ్నం కొన్ని కోర్సులు నడుస్తున్నాయి. కంటైనర్లతో నిర్మాణం చేసిన గదుల్లో ల్యాబ్ ఏర్పాటు చేయాల్సిని దుస్థితి. యూనివర్సిటీల్లో చేరుతున్న వారి సంఖ్య ప్రతి ఏడాది పెరుగుతుంది. వారందరికీ ఈ అరకొర సదుపాయాలు సరిపోవడం లేదు. విభజన చట్టం ప్రకారం 2021 నాటికి యూనివర్శిటీ నిర్మాణం పూర్తి కావాలి. ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప పనుల్లో మాత్రం ఎటువంటి మెరుగుదల లేదు. గిరిజన యూనివర్శిటీ నిర్మాణం పూర్తయితే గిరిజన ప్రాంతంతో పాటు విజయనగరం జిల్లా కూడా అభివృద్ధి చెందుతుంది. ఆర్థికంగా వెనుకబడిన జిల్లాకు ఎంతో కొంత ఆర్థిక వనరులను సమకూర్చుకోగలదు. వేల మంది విద్యార్థులు చదువుకోవడానికి ఉపయోగ పడుతుంది. చాలా మందికి ఈ జిల్లాలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. కాబట్టి ఇప్పటికైనా పాలకులు ఉత్తుత్తి ప్రకటనలు ఆపి నిర్మాణ పనిలో మెరుగుదల కనబరచాలి.

- డి.రాము,
ఎస్.ఎఫ్.ఐ విజయనగరం జిల్లా అధ్యక్షులు,
సెల్ : 9705545164

అభిప్రాయం

వైద్యుడి (దు)స్థితి...

కోల్‌కతా హత్యోదంతం నేపథ్యంలో జూనియర్ డాక్టర్ల నిరసనలు, చర్చల ద్వారా దేశవ్యాప్తంగా ఆసుపత్రుల్లో సిబ్బందిపై దాడుల అంశం తెరపైకి వచ్చింది. వైద్యులపై, ఆసుపత్రులపై దాడులు అనాదిగా వస్తున్నా, అవి మరింతగా ఆందోళనకర స్థాయిలో పెరగడం దేశవ్యాప్త సమస్యగా మా రింది. వీటిని అడ్డుకట్ట వెయ్యడం సమాజ ఆరోగ్యానికి తక్షణ అవసరం. ఈ సందర్భంగా నా వ్యక్తిగత అనుభవం చెప్తాను.




ఆంధ్రా మెడికల్ కాలేజి, విశాఖ పట్టణంలో 1993లో నా ఎం.బి.బి.ఎస్ ఇంటర్న్ షిప్ పూర్తయిన వెంటనే పీజీ ఎంట్రన్స్ అయ్యి, జాయిన్ అయ్యే దాకా బయట ఒక ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో డ్యూటీ డాక్టరుగా జాయిన్ అయ్యాను. స్పెషలిస్టు డాక్టరు ఇచ్చిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం వైద్యమందేలా చూడడం, అత్యవసరమైతే వైద్యం మొదలు పెట్టి వారొచ్చే దాకా కొనసాగించడం, రెగ్యులర్ రౌండ్స్ వేసి రోగి స్థితిని రికార్డు చెయ్యడం లాంటి పనులు ఉండేవి. అదనంగా ఓపీ చూడడం, దెబ్బలకు కుట్లు వెయ్యడం లాంటివి ఉండేవి. అప్పుడు ప్రైవేట్ హాస్పిటళ్లు అక్కడక్కడా ఉండేవిగానీ కార్పొరేట్‌వి దాదాపు లేనట్టే. ఒకసారి పోర్టు నుండి ఒక యాక్సిడెంట్ కేసు వచ్చింది. మెడ వెన్నెముక విరిగింది. శరీరం కింద భాగం చచ్చుబడింది. న్యూరోసర్జన్ చూశారు. 'ఆపరేషన్ చెయ్యాలి, అయినా ఫలితం చెప్పలేం. హై రిస్కు. ఒప్పుకుంటే ఆపరేషన్ చేస్తాం' అన్నారు. వారు సరే అన్నారు. ఆపరేషన్ అయిన నాలుగో రోజు రోగి పరిస్థితి విషమించి ప్రాణం పోయింది. అలాంటి పరిస్థితిలో వెంటిలేటర్లు పెట్టడానికి, కొంత సమయం తీసుకోడానికి అప్పటికి ఆ సౌకర్యాలు ప్రయివేట్ నర్సింగ్ హోమ్‌లలో గానీ, ప్రభుత్వ ఆసుపత్రులలో గానీ లేవు. నేను డ్యూటీకి వెళ్లే సరికి, ముందున్న టీమ్ చావు కబురు రోగి బంధువులకూ, మాకూ అందజేసి నిష్క్రమించింది. మొదట అంతా శాంతంగానే ఉన్నారు. రెండు గంటల తర్వాత వాళ్ల బంధువులమంటూ ఓ గుంపు దిగింది. అరుపులూ, కేకలు. ఎవరేం మాట్లాడుతున్నారో తెలీదు. సిబ్బంది, మిగతా రోగులు బితుకు బితుకు. రక్షణ ఏముంటుంది? నేను మాత్రం వీలైనంత కూల్‌గా రోగి పరిస్థితి, దిగజారిన క్రమం అడిగిన వారికి చెప్తూనే ఉన్నాను. కొన్ని తలుపులు బద్దలు కొట్టారు. నన్ను కొట్టబోతే ఒక రోగి బంధువు అడ్డుకున్నాడు 'ఈ డాక్టరు సిన్సియర్‌గా వచ్చి బాగా చూసుకున్నారు. ఏమీ అన వొద్దు' అని. వాళ్ళ కోపం తగ్గాక వెళ్తూ వెళ్తూ 'మీరు కాబట్టి ఏమీ అనలేదు. ఇంకో డాక్టరైతేనా' అంటూ వెళ్లారు. నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు గానీ ఆ మూడు గంటల టెన్షన్ ఎప్పటికీ మర్చి పోలేనిది. అలాంటి టెన్షన్ ఉన్న వాతా వారణంలో కూల్‌గా డ్యూటీ చెయ్యడం మానవ మాత్రుడికి సాధ్యం కాదు. కాబట్టి ఎప్పుడైనా వైద్య సేవలందించే వారికి పూర్తి భద్రతా వాతా వరణం ఉండాలి. సేఫ్‌గా ఉన్నామన్న భరోసా, ఏమైనా ప్రతికూల పరిస్థితి ఎదురైతే స్పందించి రక్షించ గల వ్యవస్థ ఉందన్న నమ్మకం ఉండాలి. రోగి బంధువులకు దైవంగా కనిపించిన వైద్యుడు దయ్యంగా కనిపించడానికి క్షణం పట్టదు. వారిని నిందించి ప్రయోజనం లేదు, వాళ్ళ మానసిక స్థితి వారిది. కాబట్టి వ్యవస్థే మారాలి. ప్రభుత్వాలు దాడుల్ని తీవ్రంగా పరిగణించి కఠిన చట్టాలు తేవాలి. ఆరోగ్యానికి నిధులు పెంచి రోగులకు వైద్య సౌకర్యాలు మెరుగు పర్చాలి. ఆసుపత్రుల్లో అధునాతన పర్యవేక్షణ పెంచడంతో పాటు, సున్నిత ప్రాంతాల్లో విజిటర్లను పరిమితం చెయ్యాలి. ఇక డాక్టర్లు, ఇతర సిబ్బంది రోగుల పట్ల సహానుభూతితో ఉండాలి. తగు సమయమిచ్చి ఓదార్పు చూపించాలి. పవిత్రమైన వైద్య వృత్తి సురక్షితమైతేనే సమాజానికి ఆరోగ్యం. సమాజంలో ఎవరి పాత్ర వారు పోషిస్తేనే అది సాధ్యం.

-డా.డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం, విజయనగరం.

వ్యాఖ్య

బంగ్లా జమాతేపై నిషేధం రద్దు!

మతోన్మాద జమాతే ఇస్లామీ పార్టీపై ఉన్న నిషేధాన్ని బుధవారం నాడు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పార్టీ, దాని అనుబంధ విద్యార్థి విభాగానికి చెందిన వారు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటు న్నారంటూ ఆగస్టు ఒకటవ తేదీన నాటి అవామీ లీగ్ ప్రభుత్వం నిషేధం విధించింది. తరువాత నాలుగు రోజులకే హసీనా ప్రభుత్వ పతనం, ఆమెను బలవంతంగా మిలిటరీ అధికారులు మన దేశానికి పంపటం తెలిసిందే. తమ దర్యాప్తులో అలాంటి రుజువులేమీ లేవని తేలినందున నిషేధాన్ని ఎత్తివేసినట్లు యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామం తరువాత తమ పార్టీ నమోదును రద్దు చేస్తూ గతంలో ఒక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి పునరుద్ధరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయనున్నట్లు జమాతే ప్రకటించింది. బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ఒక వివాదాస్పద సంస్థ. బ్రిటీష్ ఇండియాలో 1941లో ఏర్పడిన ఈ సంస్థ బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని వ్యతిరేకించటమేగాక పాకిస్తాన్‌తోనే కలసి ఉండాలనే వైఖరి తీసుకుంది. విముక్తి కోసం పోరాడిన వారి మీద దాడులు, హత్యలకు పాల్పడింది. దాంతో ముజిబుర్ రహమాన్ ప్రభుత్వం 1972లో దాన్ని నిషేధించింది. ముజిబుర్ హత్య తరువాత అధికారానికి వచ్చిన జియావుర్ రహమాన్ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసింది. జమాతే పార్టీ కార్యకలాపాలు లౌకిక వ్యవస్థ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున దాని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ 2009లో దాఖలైన పిటీషన్‌పై 2013లో హైకోర్టు విచారించి ఆమోదించింది. అప్పటి నుంచి అది ఎన్నికల్లో నేరుగా పాల్గొనటం లేదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు (బిఎన్‌పి), ఇతర పార్టీల కూటమిలో భాగస్వామిగా ఉంటూ అవామీ లీగ్‌ను వ్యతిరేకిస్తున్నది. అయితే అవామీలీగ్ అణచివేత చర్యల కారణంగా జమాతేతో చేతులు కలిపినప్పటికీ దానితో సంబంధాలను వ్యతిరేకించే శక్తులు కూడా బిఎన్‌పిలో ఉన్నాయి. గతేడాది కూడా సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పటికీ దాని ప్రతినిధులు కోర్టుకు రాని కారణంగా కొట్టివేశారు. ఇప్పుడు రిజిస్ట్రేషన్‌ను పునరుద్ధరించేందుకే అవకాశాలున్నాయి. ఒక వేళ అదే జరిగితే జమాతే వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగటం ఖాయం.



షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతు ఇచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్ద ఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది. హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమ దేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీ లీగ్ వ్యతిరేక పార్టీలు పదే పదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్ర మోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. అవామీ లీగ్ ఇతర పార్టీ నేతల మీద కూడా కేసులు నమోదు చేయటమేగాక ఇప్పటి వరకు ఇద్దరు మాజీ మంత్రులను అరెస్టు చేశారు.


బంగ్లాదేశ్ యువతలో ఉన్న ఆగ్రహానికి దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఒక కారణం. విదేశీ చెల్లింపుల సమస్యలతో పాటు ఇటీవల వచ్చిన వరదలు కూడా గోరు చుట్టు మీద రోకటి పోటులా మారాయి. ఆగస్టు 21వ తేదీ నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 20 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. మొత్తంగా మరో 11 బిలియన్ డాలర్లు అవసరం కాగా డిసెంబరు నాటికి కనీసం 8 బిలియన్ డాలర్లు అవసరమని అంచనా వేసి ఐ.ఎం.ఎఫ్‌తో సహా వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు. అక్కడి జనం షేక్ హసీనా గద్దె దిగాలని మాత్రమే కాదు. తమ పరిస్థితి మెరుగుపడాలని కూడా కోరుకుంటున్నారు. అది జరగకపోతే మరోసారి ఆందోళన మరో రూపంలో జరగటం ఖాయం.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

కృష్ణా జలాశయాలకు భారీ వరద

- ప్రకాశం బ్యారేజీ నుంచి రెండు లక్షల క్యూసెక్కులు విడుదల



సాగర్ 26 గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో నాగార్జున సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి వరద పోటు పెరిగింది. కృష్ణా పరివాహక ప్రాంతంలో అన్ని జలాశయాలకు వరద ప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం నుండి దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదలవుతుండడంతో నాగార్జున సాగర్‌కు 3,55,910 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. దీంతో సాగర్ 26 గేట్లను ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 590 అడుగులకు చేరింది. ఎగువ నుంచి పులిచింతలకు 2.40 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా ఇదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో గరిష్ట నీటి నిల్వ 45.77 టిఎంసిలు కాగా ప్రస్తుతం 44.94 టిఎంసిల నిల్వ ఉంది. పులిచింతల నుంచి వస్తున్న నీటిని ప్రకాశం బ్యారేజీకి మళ్లిస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి రెండు లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు.

రొయ్యల అక్రమ సాగుపై కొత్తపేట గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - రామచంద్రపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ)

అక్రమ రొయ్యల చెరువులను నిలిపివేయాలంటూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కొత్తపేట గ్రామస్తులు గురువారం ధర్నాకు దిగారు. హైకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా అక్రమంగా రొయ్యల సాగు చేస్తుండడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలో కొంతమంది చేపల చెరువుల నిమిత్తం ఆరు ఎకరాలకు అనుమతులు తీసుకుని చెరువులు తవ్వారని తెలిపారు. అయితే వీటిలో రొయ్యలను సాగు చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారని, ఇందులో భాగంగా బుధవారం రొయ్య సీడ్ వేసేందుకు ప్రయత్నించారన్నారు. దీనిని గమనించి అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పటికే గ్రామంలో మంచినీటి చెరువులు, బావులు కలుషితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల పెంపకానికి ఉప్పునీటిని వాడతారని, ఫలితంగా భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, రొయ్యల చెరువులను మూసివేయాలని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని తెలిపారు. దీంతో ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించామన్నారు. చేపల చెరువులను కొనసాగించాలని, ఉప్పునీటి రొయ్యల చెరువులను మూసివేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందని వివరించారు. కోర్టు ఆదేశాలను సైతం పక్కనపెట్టి యజమానులు రొయ్యల పెంపకాన్ని చేపడుతున్నారని తెలిపారు. మత్స్య శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో తామే అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఇ-కామర్స్‌లో చేనేత వస్త్రాల విక్రయాలు

- చేనేత, జౌళిశాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చేనేత కార్మికులు తయారుచేసే చేనేత వస్త్రాలను ఇ-కామర్స్‌లో అమ్మకాలకు చర్యలు తీసుకుంటామని బిసి, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణను రూపొందిస్తున్నట్టు చెప్పారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం సభ్యులు గురువారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రం ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం గత ప్రభుత్వాలు తెచ్చిన పథకాలన్నింటినీ జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు 365 రోజులు పని కల్పించడమే లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన వస్త్ర ప్రదర్శన విజయవంతమైందని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ ప్రతినిధులు పిఎం త్రినాథ్, బి మోహన్‌కృష్ణ, ఆనంద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధి సంస్థ తీరుపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి

తిరుమలలో క్యాంటీన్లను నిర్వహించకుండా సబ్ లీజుకు ఎందుకు ఇచ్చారని పర్యాటకాభివృద్ధి సంస్థను హైకోర్టు ప్రశ్నించింది. తిరుమలలో క్యాంటీన్ నిర్వహణకు టిటిడి అనుమతులిస్తే, ఆ క్యాంటీన్‌ను మరొకరికి సబ్ లీజుకు ఇవ్వడానికి ఎపిటిడిసి టెండర్లు పిలవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పూర్తి వివరాలు సమర్పించాలని ఎపిటిడిసిని ఆదేశించింది. విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. తిరుమలలో క్యాంటీన్ నడుపుకునేందుకు టిటిడి నుంచి అనుమతి పొందిన ఎపిటిడిసి ఆ తర్వాత సబ్ లీజుకు టెండర్లు పిలవడాన్ని హైదరాబాద్‌కు చెందిన సురవరం ప్రతాప్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. సబ్ లీజ్‌కు ఇవ్వడం చట్ట వ్యతిరేకమని న్యాయవాది పితాని అమరేంద్ర కుమార్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

కార్మిక సంఘాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్ సమావేశాలు జరిపి మాటలతో కాకుండా చేతలతో ప్లాంట్ పరిరక్షణకు పూనుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 1295వ రోజుకు చేరకున్నాయి. ఈ దీక్షల్లో విఎస్ఇయు, యూస్, విఎస్ఎంఎస్, డిఐటియు యూనియన్లకు చెందిన వివిధ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం కలిసి చేస్తున్న కుట్రలను కార్మికులు ఐక్యంగా తిప్పికొడతారని తెలిపారు. యువ కార్మికులు ఇప్పటికే ఆందోళనలో ఉన్నారన్నారు. స్టీల్ ప్లాంట్ భవిష్యత్తును నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా నిరసించారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, ఉత్పత్తిని పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలను ముమ్మరం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఐదు రోజులకు ఓ కుబేరుడు

- దేశంలో కొత్తగా పుట్టుకొస్తున్నారు
- చైనాలో తగ్గిన సంఖ్య
- షారుక్‌ఖాన్‌కు తొలిసారి చోటు
- పిన్న వయస్కుల్లో జెప్టో వ్యవస్థాపకులు



న్యూఢిల్లీ : దేశంలో అధిక ధరలతో ఓ వైపు పేదలు, మధ్యతరగతి ప్రజల ఆదాయాలు హరించుకుపోతుంటే.. మరోవైపు సంపన్నుల ఆదాయాలు కోట్ల రూపాయాల్లో పెరిగిపోతున్నాయి. భారత్‌లో ప్రతీ ఐదు రోజులకు ఒక్క కుబేరుడు పుట్టుకొస్తున్నారని హురున్ ఇండియా వెల్లడించింది. గతేడాది వీరి సంఖ్య 29 శాతం పెరిగిందని హురున్ ఇండియా వ్యవస్థాపకులు అనస్ రెహమాన్ జునైద్ వెల్లడించారు. దేశంలో రికార్డ్ స్థాయిలో 334 మంది బిలియనీర్లు నమోదయ్యారని తెలిపారు. మరోవైపు చైనాలో బిలియనీర్ల సంఖ్య 25 శాతం పడిపోయిందన్నారు. జులై 31 నాటి గణాంకాలను ఆధారంగా చేసుకొని హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2024 నివేదికను ప్రకటించింది. గౌతం అదానీ అగ్రస్థానంలో నిలువగా.. ముకేష్ అంబానీ రెండో స్థానానికి పడిపోయారు. మొదటిసారిగా బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ హురున్ ఇండియా రిచ్ లిస్ట్‌లో చ ో ట ం సంపాదించారు. ఐపిఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్‌లో తాను వాటాలు కలిగి ఉండడంతో వాటి విలువ పెరిగింది. దాంతో మొత్తంగా రూ.7,300 కోట్లతో ఈ లిస్ట్‌లో స్థానం సంపాదించారు. గతేడాది అదానీ సంపద 95 శాతం పెరిగి రూ.11.61 లక్షల కోట్లకు చేరింది. అంబానీ సంపద రూ.10.14 లక్షల కోట్లుగా ఉంది. గత ఐదేళ్లుగా శివ్ నాడార్, సైరస్ ఎస్ పూనావాలా అండ్ ఫ్యామిలీ, గోపిచంద్ హిందుజా అండ్ ఫ్యామిలీ, డీమాట్ అధినేత రాధాకిషన్ దమానీ అండ్ ఫ్యామిలీ టాప్ 10 స్థానాల్లో ఉన్నారు. సినీ ప్రముఖుల విషయంలో జూహీ చావ్లా, హతిక్ రోషన్, అమితాబ్, కరణ్ జోహార్ టాప్-5లో నిలిచారు. ఈ జాబితాలో జెప్టో వ్యవస్థాపకుడు 21 ఏళ్ల కైవల్య వోహ్రా అతి పిన్న వయసులోనే బిలియనీర్‌గా నమోదయ్యారు. ఆ సంస్థ మరో సహ వ్యవస్థాపకుడు 22 ఏళ్ల అదిత్ పలిచా ఈ జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు.

నేవీ అధికారుల హనీ ట్రాప్ వ్యవహారంలో స్పీడ్ పెంచిన ఎన్ఐఎ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

నేవీ అధికారుల హనీ ట్రాప్ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) స్పీడు పెంచింది. గురువారం విశాఖలో పలుచోట్ల ఎన్ఐఎ అధికారులు తనిఖీలు చేశారు. 2021లో కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నమోదు చేసిన కేసుకు సంబంధించి దేశవ్యాప్తంగా తాజాగా ఏడు రాష్ట్రాల్లో 16 ప్రాంతాల్లో విస్తృత తనిఖీల్లో భాగంగా విశాఖలోని పలు ప్రాంతాల్లో రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించారు. భారత రక్షణ శాఖ సమాచారాన్ని పాకిస్తానీ ఐఎస్ఐకి చెందిన అనుమానితుల లక్ష్యంగా తనిఖీలు జరిపారు. ఐఎస్ఐ నుంచి డబ్బులు అందుకున్న వారిపై కూడా ఎన్ఐఎ నిఘా పెట్టింది. రెండు రోజులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంతో పాటు గుజరాత్, కర్ణాటక, కేరళ, తెలంగాణ. ఉత్తరాదికి చెందిన 16 ప్రాంతాల్లో సోదాలు జరిపింది. 22 సెల్ ఫోన్లు, కీలక పత్రాలు లభించాయని సమాచారం. ఎన్ఐఎ త్వరలో పూర్తి స్థాయి వివరాలు వెల్లడించే అవకాశం ఉందని పోలీస్ అధికారులు చెబుతున్నారు.

గంజాయి కేసులో పది మంది అరెస్టు

ప్రజాశక్తి- విజయనగరం కోట

గంజాయి కేసులో పదిమంది నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో నిందితులను హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నిందితులు చోరీలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించి, గతంలో నేరాలకు పాల్పడిన కేసుల్లో ఐదు మోటారు సైకిళ్లు, ఒక మొబైల్ ఫోను రికవరీ చేసినట్లు వెల్లడించారు. రైల్వే స్టేషను సమీపంలోని రైల్వే పాత క్వార్టర్సు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం రావడంతో పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

మాతృభాషలోనే జ్ఞానం పెరుగుదల

- తెలుగు భాషా దినోత్సవంలో సిఎం చంద్రబాబు



గిడుగు రామ్మూర్తికి నివాళులర్పిస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంగ్లీషు వస్తేనే జీవితమని గత ప్రభుత్వం చెప్పేదని, ఇంగ్లీషు వస్తే ఉద్యోగాలు వస్తాయనుకోవడం పొరపాటేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పిల్లల్లో సృజనాత్మకత, జ్ఞానం పెరగాలంటే మాతృ భాషతోనే సాధ్యమని అన్నారు. మాతృ భాషను విధ్వంసం కాకుండా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి నేపథ్యంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. తెలుగు భాషను గౌరవించుకునేందుకు ప్రతి ఏడాది గిడుగు రామ్మూర్తి జయంత్యుత్సవాలు జరుపుకుంటున్నామని, భాష లేకపోతే మనజాతి మనుగడే ఉండదని అన్నారు. మన సంస్కృతికి, సంప్రదాయాలకు మూలం మన భాష అని పేర్కొన్నారు.

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా అత్యధికులు తెలుగువారేనని అన్నారు. దేశంలో నాలుగో భాషగా వుంటే, అమెరికాలో 11వ భాషగా తెలుగు వుందని తెలిపారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసి తెలుగు వారి కోసం రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అయితే తెలుగువారి ఆత్మగౌరవాన్ని దేశ నలుమూలలా చాటి చెప్పిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రాన్ని పోరాడి సాధించుకున్నామని అన్నారు. గత ప్రభుత్వం ఇంగ్లీషే జీవితం అన్నట్టు వ్యవహరించి మాతృ భాషను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు చర్యలు తీసు కుంటామని తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతా మన్నారు. అలాగే ప్రపంచం గర్వపడేలా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారు. జిఓ నెంబరు 77తో తెలుగు పండిట్లకు అన్యాయం జరుగుతోందని అధ్యయనం చేసి సరిచేస్తామని అన్నారు. గడిచిన ఐదేళ్లలో కళాకారులను పని చేయించుకుని డబ్బులు ఇవ్వని పరిస్థితి వుందన్నారు. తెలుగు కళాకారులను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కూచిపూడి నృత్యానికి దేశవ్యాప్తంగా ఆదరణ ఉండేలా తీర్చిదిద్దుతామన్నారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగు మాట్లాడటం, చదవటమే పాపమైనట్లు గత ప్రభుత్వం వ్యవహరించిందని విమర్శించారు. మనకు వాడుక భాషను అందించిన ఘనత గిడుగు రామూర్తిదేనని అన్నారు. పిఠాపురం రాజావారు సూర్యరాయేంద్ర వ్యాకరణానికి చెందిన ఏడు సంకలనాల పునరుద్ధరణకు ముఖ్యమంత్రి తోడ్పాటు అందించాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగు భాష కోసం పనిచేసిన 17 మంది కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం సత్కరించింది.

ఆర్థిక ప్రయోజనాలకు కోతలొద్దు

- నేడు నిరసనలకు ఎస్‌డబ్ల్యుఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వంలో విలీనం పేరుతో ఆర్‌టిసి కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు కోత విధించి ఇబ్బందులకు గురిచేసిన యాజమాన్య నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ శుక్రవారం నిరసనలు చేపట్టాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) పిలుపునిచ్చింది. జిఓ 114లో అలవెన్స్‌లకు అనుమతి లేదని ట్రెజరీ అధికారులు అన్ని డిపోల్లోని కార్మికులకు నైట్, డే అవుల్ అలవెన్స్‌లను రద్దు చేయడం అన్యాయమని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్‌కె జిలానీ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ సుందరయ్య, అయ్యప్పరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రైవర్, కండక్టర్లకు హక్కుగా రావాల్సిన అలవెన్స్‌లను వేతన బిల్లు ద్వారా చెల్లించకుండా ఏకపక్షంగా రద్దు చేశారని అన్నారు. కార్మికులకు అమలవుతున్న ఆర్థిక ప్రయోజనాలను ఉపసంహరించుకోవాలని ఏ విలీన కమిటీ కూడా ప్రతిపాదించలేదని పేర్కొన్నారు. ఉద్యోగ, కార్మికులను శిక్షించడానికి ప్రభుత్వం తీసుకున్న చొరవ, వారి ఆర్థిక ప్రయోజనాల కొనసాగింపు కోసం కృషి చేయకపోవడం అభ్యంతరకరమన్నారు. అలవెన్స్‌లను తక్షణం పునరుద్ధరించి, ఎరియర్స్‌తో సహా సెప్టెంబరు లో చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆ సీట్లు ఎవరికి?

- టిడిపి నేతల్లో చిగురించిన ఆశలు
- ఆశావహుల్లో హరికృష్ణ కుమార్తె సుహాసిని?


సుహాసిని


గల్లా జయదేవ్


కంభంపాటి రామ్మోహన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'రాజ్యసభ, శాసనమండలి పదవులు రెండేళ్ల తరువాతే. అప్పటి వరకు ఏదో ఒక నామినేటెడ్ పదవితో సర్దుకుపోదాం'. నిన్నటి వరకు టిడిపి సీనియర్ నేతల్లో వినిపించిన మాటలివి. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. కొంతమంది వైసిపి రాజ్యసభ, శాసనమండలి సభ్యులు తమ పదవులకు రాజీనామా చేస్తుండటంతో వాటిని పొందేందుకు టిడిపి నేతలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు తమ రాజ్యసభ సభ్యత్వాలకు, పోతుల సునీత తన శాసనమండలి సభ్యత్వానికి రాజీనామాలు చేసిన విషయం తెలిసిందే. వీరితో పాటు వైసిపి రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, ఆర్ కృష్ణయ్యలతో ఆ పార్టీకి చెందిన కొంతమంది ఎమ్మెల్సీలు కూడా రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వైసిపికి ఆ పదవులను తిరిగి గెలుచుకునే అవకాశం లేకపోవడంతో టిడిపిలోని పలువురు సీనియర్ నేతలు వాటిపై ఆశలు పెట్టుకుంటున్నారు. రాజ్యసభ ఆశిస్తున్న వారిలో మాజీ ఎంపిలు కంభంపాటి రామ్మోహన్ రావు, గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర, పనబాక లక్ష్మీ, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో పాటు పార్టీ సీనియర్ నేతలు టిడి జనార్ధన్, వర్ల రామయ్య, పయ్యావుల ఆదికేశవుల నాయుడు పేర్లు వినపడుతున్నాయి. నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని కూడా ఈ రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సుహాసిని ప్రస్తుతం తెలంగాణలో పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. ఈమెకు పదవి ఇవ్వడం వల్ల హరికృష్ణ కుటుంబానికి న్యాయం చేసినట్లవుతుందని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. గుంటూరు ఎంపిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించిన ఆయన గత ఎన్నికల్లో పోటీ చేయడానికి నిరాకరించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావడంతో రాజ్యసభకు పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లు తెలిసింది. తాను రాజ్యసభకు వెళితే కేంద్రమంత్రి వర్గవిస్తరణలోనూ అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు చెబుతున్నారు. కంభపాటి ఏలూరు, రాజమండ్రి లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేయాలని ఆశించారు. అయితే పొత్తు, ఇతర కారణాల రీత్యా ఆయనకు అవకాశం రాలేదు. ప్రస్తుతం రాజ్యసభ, రాష్ట్రప్రభుత్వ ఢిల్లీ అధికార ప్రతినిధి పదవులు ఆశిస్తున్నారు. ఆలపాటి, పనబాకలకు కూటమి పొత్తులో భాగంగా సీట్లు కేటాయించలేదు. వర్ల రామయ్యకు చేతిదాక వచ్చిన రాజ్యసభ సీటును గతంలో కనకమేడలకు కేటాయించడంతో దక్కలేదు. దీంతో ఈసారైనా వర్లకు వస్తుందనే చర్చ పార్టీలో జరుగుతోంది.

పోతులకు నో ఎంట్రీ

శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేసిన పోతుల సునీతకు టిడిపి లో వెళ్లేందుకు డోర్లు మూతపడ్డాయని అంటున్నారు. గతంలో ఆమె టిడిపి మహిళా విభాగం అధ్యక్షురాలి పదవితో పాటు, ఎమ్మెల్సీగా కూడా పని చేశారు. పార్టీ నేతలతో గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు ఆమె చేరికపై అభిప్రాయాన్ని కోరినట్లు తెలిసింది. అయితే, ఆమె చేరికను దాదాపు టిడిపి నేతలందరు వ్యతిరేకించారు. వైసిపిలో చేరిన తరువాత లోకేష్, నారా భువనేశ్వరి, బ్రాహ్మణిలపై తీవ్రపదజాలంతో ఇష్టానుసారంగా నోరు పారేసు కుందని, శాసనమండలిలో లోకేష్‌ను కూడా దూషించిందని, దీంతో ఆమెను పార్టీలో చేర్చుకుంటే కార్యకర్తలు, నేతల మనోభావాలు దెబ్బతింటాయని వారంతా చెప్పినట్లు సమాచారం.


నటి వ్యవహారంలో ఐపిఎస్‌ల పాత్రపై విచారణకు పోలీసు కమిషనర్ ఆదేశం

- విచారణాధికారిగా ఎసిపి స్రవంతి నియామకం

ప్రజాశక్తి - విజయవాడ, అమరావతి బ్యూరో

ముంబయి నటి కాదాంబరి జిత్వాని వ్యవహారంలో ఐపిఎస్‌ల పాత్ర ఉందన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్‌వి రాజశేఖర బాబు చర్యలకు ఉపక్రమించారు. ఈ వ్యవహారంపై విచారణకు విజయవాడ క్రైమ్ ఎసిపి స్రవంతి రాయ్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్ ఎసిపి స్రవంతిని సిపి రాజశేఖరబాబు ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కుమారుడికి నటి జిత్వాని ఓ పార్టీలో పరిచయమై ఆయనను ట్రాప్ చేసి రూ. ఐదు లక్షలు వసూలు చేసినట్లు అప్పట్లో పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. అప్పట్లో వచ్చిన ఆరోపణల ప్రకారం.. జడ్‌పి మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త కుమారుడు, ఆ నటి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. అతని కుటుంబానికి ఇష్టం లేక పెళ్లిని ఆపేందుకు వైసిపి ప్రభుత్వంలోని కీలక వ్యక్తిని సంప్రదించి రూ.ఐదు కోట్లకు డీల్ మాట్లాడుకొని విజయవాడ పోలీసు ఉన్నతాధికారికి ఈ వ్యవహారాన్ని పరిష్కరించే బాధ్యత అప్పగించారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 2వ తేదీన విజయవాడ పోలీసులు ముంబయి వెళ్లి నటి జిత్వాని కుటుంబాన్ని విజయవాడ తీసుకొచ్చి ఓ అతిథి గృహంలో ఉంచి పారిశ్రామికవేత్త కుమారుడితో పెళ్లి విరమించుకోవాలంటూ చిత్రహింసలు పెట్టారు. ఒప్పుకోకపోవడంతో రూ. ఐదు లక్షల ఛీటింగ్ కేసు పెట్టి జైలుకు పంపారు. ఆ తర్వాత రాజీకి వచ్చి పెళ్లి విషయంలో వెనక్కి తగ్గడంతో బెయిల్ కూడా పోలీసులే ఇప్పించి పంపేశారు. ఇందులో పోలీసు కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు ఐపిఎస్‌ల పాత్ర ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణకు ఎసిపి స్రవంతిని నియమిస్తూ సిపి రాజశేఖర బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

క్రికెట్‌కు వెస్టిండీస్ క్రికెటర్ గాబ్రియేల్ గుడ్‌బై



గయానా: వెస్టిండీస్ ఫాస్ట్ బౌలర్ షనాన్ గాబ్రియేల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్‌నుంచి వైదొలు గుతున్నట్టు వెల్లడించాడు. దీంతో 12ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు 36ఏళ్ల గాబ్రియేల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపాడు. దేశం తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడేందుకే అంకితమయ్యాను. అంతర్జాతీయ వేదికల మీద క్రికెట్ ఆడడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. అయితే.. అన్ని మంచి విషయాలు కూడా ఏదో రోజు ముగుస్తాయి కదా?' అని గాబ్రియెల్ తన పోస్ట్‌లో వెల్లడించాడు. వెస్టిండీస్ తరపున ఈ పేసర్ ఇప్పటివరకూ 86 మ్యాచ్‌లు ఆడాడు. వీటిలో 59 టెస్టులు ఉండడం విశేషం. కుడి చేతివాటం పేసర్ అయిన గాబ్రియెల్ 2012లో లార్డ్స్‌లో ఇంగ్లండ్ మీద టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌తో మొదలైన అతడి ప్రభంజనం పదేండ్ల పాటు కొనసాగింది. తనకు ఎంతో అచ్చొచ్చిన సుదీర్ఘ ఫార్మాట్‌లో ఈ స్పీడ్‌స్టర్ 32.21 సగటుతో 166 వికెట్లు పడగొట్టాడు. అందులో ఆరుసార్లు అతడు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. టెస్టుల్లో విజయవంతమైన గాబ్రియెల్ శ్రీలంకపై అత్యుత్తమ గణాంకాలు (13/121)నమోదు చేశాడు.

భాషా ప్రాచీనతను కాపాడుకోవాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల (కడప జిల్లా)

భాషా ప్రాచీనతను పరిరక్షించుకోవటంతో పాటు భాష మనుగడను కాపాడుకోవటం అత్యంత ఆవశ్యకమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కలమల్లలో తొలితెలుగు శిలాశాసనం వెలుగు చూసిన చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గిడుగు స్ఫూర్తితో తెలుగు భాష, సంస్కృతులను యువతరం కాపాడుకోవాలన్నారు. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనదో, మన సంస్కృతి కూడా అంతే ప్రాచీనమైందని వివరించారు. తెలుగు లాంటి మహోన్నత భాష ప్రాచీనతకు శిలాశాసనాలు సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. శాసనాల ప్రాచీనత మీద వ్యక్తమౌతున్న సందేహాల విషయంలో మరిన్ని పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. శాసనాల పరిరక్షణ విషయంలో తమిళనాడును ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. తెలుగు భాష పరిరక్షణ, శాసనాలను సంరక్షణ కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణరెడ్డి ప్రసంగించారు. జెసి అదితి సింగ్, జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి, డిఇఒ అనురాధ, డిఎఫ్‌ఒ సందీప్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, భాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ రాష్ట్రంలో ఇళ్లపై మొసళ్లు..

● వర్ష బీభత్సంతో గుజరాత్ అతలాకుతలం ● 40కి పెరిగిన మృతుల సంఖ్య ● నీటిలో మునిగిన పలు ప్రాంతాలు, రోడ్లు, ఇండ్లు ● దాదాపు 40 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
● ట్రాఫిక్, విద్యుత్, రైల్వే సర్వీసులకు అంతరాయం ● సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్‌తో పాటు త్రివిధ దళాలు

దేశానికే గుజరాత్ మోడల్ అంటూ ప్రధాని మోడీ చెబుతుంటారు. గతకొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు గుజరాత్‌ను నామరూపాల్లేకుండా చేస్తున్నాయి. ఇంటిపై కప్పులపై మొసళ్లు తిరుగుతున్నాయి. వర్షబీభత్సంతో జనం బిక్కుబిక్కుమంటూ..కాపాడాలంటూ దీనంగా ప్రాధేయపడుతున్నారు. ప్రజలను కాపాడాల్సిన 'డబుల్ ఇంజిన్' సర్కార్ చేతులెత్తేసింది. దీంతో వర్షం తగ్గుముఖం పట్టినా అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వరద పరిస్థితులే కొనసాగుతున్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాతుడు కరువయ్యాడు. సహాయక బలగాల చొరవ వల్ల మాత్రమే కాస్త ఉపశమనం కలుగుతోంది. ప్రజలకు నిత్యావసరాలు అందజేయడంలో కానీ, పునరావాస శిబిరాల్లో సౌకర్యాల పట్ల కానీ ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదు.



గాంధీనగర్ : గుజరాత్‌లో వర్షాలతో చెరువులు తెగిపోతున్నాయి. భారీగా చేరుతున్న జలాశయాలతో ఇండ్లు, లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అకాల వర్షాలతో ఇప్పటివరకు మృతుల సంఖ్య 40కు పెరిగింది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి దాదాపు 40 వేల మందిని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యంగా, సౌరాష్ట్ర ప్రాంతం ఉక్కిరిబిక్కిరయ్యింది. పలు ప్రాంతాలు నీట మునిగాయి. రిజర్వాయర్లు, డ్యామ్‌లు, నదులు ప్రమాదకరస్థాయికి చేరాయి. పలు లోతట్టు ప్రాంతాలు చెరువలను తలపించాయి. రోడ్లు, ఇండ్లు నీట మునిగాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. విద్యుత్, ట్రాఫిక్, రైల్వే సర్వీసులకు అంతరాయం కలిగాయి. ఫలితంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుజరాత్ తన సగటు వర్షపాతంలో 105 శాతం నమోదు చేసిందని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ (ఎస్ఇఒసి) వివరించింది.

పలు సౌరాష్ట్ర జిల్లాలు భారీ వర్షాలను నమోదు చేశాయి. ఇందులో ద్వారక జిల్లాలోని ఖంభలియా తాలూకాలో అత్యధికంగా 454 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయ్యింది. అధికారుల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో 140 రిజర్వాయర్లు, డ్యామ్‌లు, 24 నదులు ప్రమాదకరస్థాయిని మించి మరీ ప్రవహిస్తున్నాయి. నీటి మట్టం వేగంగా పెరుగుతుండటంతో 206 డ్యామ్‌లలో 122 డ్యామ్‌లను హైఅలర్ట్‌లో ఉంచారు. భారీ వర్షాల ధాటికి ట్రాఫిక్‌కు, రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. రోడ్లు, రైల్వే లైన్లు నీటితో నిండిపోయాయి. విశ్వమిత్రి నది ఉప్పొంగటంతో దాని తీర ప్రాంతాలు జలమయమయ్యాయి. స్థానికంగా ఇండ్లలో వరద నీరు చేరింది. రోడ్లు, వాహనాలు, ఇండ్లు వరద నీటిలో మునిగి కనిపించాయి. వడోదరలో లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి.

ఇక్కడ 1200 మందికి పైగా రక్షించినట్టు అధికారులు తెలిపారు. ఇండ్లల్లో, ఇంటిపై ప్రాంతంలో చిక్కుకున్న ప్రజలను రక్షించి, సురక్షిత ప్రాంతాలను తరలించటానికి వడోదర నగరంలో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, ఆర్మీ సిబ్బంది మోహరించాయి. అలాగే, భారత వైమానిక దళం (ఐఎఎఫ్), కోస్ట్ గార్డ్ కూడా సహాయక చర్యలో పాలుపంచుకున్నాయి. 17,800 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి. 2000 మందిని రక్షించాయి. సౌరాష్ట్ర ప్రాంతంలోని దేవ్‌భూమి ద్వారక, జామ్‌నగర్, రాజ్‌కోట్, పోర్‌బందర్ జిల్లాలు అధిక వర్షాలను నమోదు చేశాయి. ఈ జిల్లాల్లో 50-200 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ద్వారక జిల్లాకు చెందిన భన్వడ్ తాలుకా అత్యధికంగా 185 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని చూసింది. సౌరాష్ట్ర జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు ఉంటాయని భారత వాతావరణ సంస్థ (ఐఎండి) అంచనా వేసింది. ఇప్పటికే, గురువారం ఐఎండీ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

సిఎంకు మోడీ ఫోన్

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల ప్రభావ పరిస్థితులను తెలుసుకోవటానికి ప్రధాని మోడీ గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్‌తో మాట్లాడారు. ప్రకృతి విపత్తు విషయంలో రాష్ట్రానికి కేంద్రం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రధాని.. సీఎంకు హామీ ఇచ్చారు.

ఇంటి పైకప్పు మీద మొసలి..వీడియో వైరల్

భారీ వర్షాల ధాటికి ఒక మొసలి ఇంటిపైకి వచ్చి చేరిన దృశ్యం వడోదరలో చోటు చేసుకున్నది. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ వైరల్‌గా మారింది. న్యూస్ ఏజెన్సీ పిటిఐ ఈ వీడియోను షేర్ చేసింది. భారీ వర్షాలకు వడోదర ప్రాంతంలోని అకోటా స్టేడియం వద్ద భారీగా నీరు చేరింది. ఈ సందర్భంగా అక్కడ ఒక ఇంటి పై కప్పు మీద మొసలి వచ్చింది.

నివాళి

భయమెరగని రచయిత
అధికారానికి నిజం చెప్పిన ధీశాలి



ఎ.జి. నూరాని

న్యూఢిల్లీ : సోమవారం తుదిశ్వాస విడిచిన అబ్దుల్ గఫూర్ నూరాని భారత దేశపు అత్యుత్తమ మేధావుల్లో ఒకరుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రఖ్యాత న్యాయవాది, రాజ్యాంగ నిపుణులు, రాజకీయ విశ్లేషకులుగా ఎంత పేరుతెచుకున్నారో రచయితగానూ అంతే ఖ్యాతి గడించారు. 1960 ప్రారంభంలో రచనా వృత్తిని ప్రారంభించిన నూరాని తుది శ్వాస వరకూ దానిని కొనిసాగించారు. 94 ఏళ్ల ఎజి నూరాని చివరి రోజుల్లో మృత్యువు ఆయన్ని కబలిస్తున్న సమయంలోనూ సుప్రీంకోర్టు బాబ్రీ మసీదు తీర్పుపై పుస్తకం రూపొందించే పనిలో ఉన్నారు. సుదీర్ఘకాలం రచయితగా కొనసాగిన నూరాని ఏ దశలోనూ నిజాన్ని, ఉద్రేకాన్ని భుజాలపై నుంచి దించలేదు. న్యాయమైన, భయమెరగని రచయితగా, అధికారానికి నిజం చెప్పిన ధీశాలిగా నిలిచారు. దేశంలో ఎమర్జెన్సీ గురించి రాసేటప్పుడు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చర్యలను అడాల్ఫ్ హిట్లర్‌తో పోల్చినట్లే, 2020లో సెంట్రల్ విస్టా ప్రాజెక్టు గురించి రాసేటప్పుడు నరేంద్ర మోడీని 'తుగ్లక్' అని సంభోదించారు. అలాగే, 'ది ఆర్ఎస్ఎస్ : మెనేస్ టు ఇండియా' అనే పుస్తకంలో ఆర్ఎస్ఎస్‌ను నిశితంగా విమర్శించారు. ఆర్ఎస్ఎస్ నిర్ధేశించుకున్న లక్ష్యాలు భారత పార్లమెంట్ నిర్ణయాలకు, భారత రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమని చెప్పారు. 'ది కాశ్మీర్ డిస్ప్యూట్ 1947-2012', 'ఆర్టికల్ 370: ఎ కానిస్టిట్యూనల్ హిస్టరీ ఆఫ్ జమ్మూకాశ్మీర్', 'ది డిస్ట్రక్షన్ ఆఫ్ హైదరాబాద్' వంటి పుస్తకాలు రచించారు. సొంతంగా అనేక పుస్తకాలను రచించినా వివిధ పత్రికల్లో కాలమ్స్‌ను కూడా నిర్వహించారు. పాకిస్తాన్‌లోని డాన్‌తో పాటు, మన దేశంలో ది స్టేట్స్‌మన్, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి దిన పత్రికల్లో ఆయన వ్యాసాలు రాసేశారు. అయితే ది హిందూ పత్రికకు చెందిన ఫ్రంట్‌లైన్‌కు సుమారు 30 ఏళ్లపాటు ఆయన రాసిన కాలమ్స్ ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఈ కాలమ్స్ కోసమే ఈ పత్రికను ప్రజలు విస్తృతంగా చదివిన సందర్భాలు ఉన్నాయి. భారత చరిత్ర, రాజకీయాలు నేపథ్యంగా ఈ కాలమ్స్ సాగేవి. వీటితో పాటు మాజీ రాష్ట్రపతి జకీర్ హుస్సేన్, బద్రుద్దీన్ త్యాబ్జీ జీవిత చరిత్రలను కూడా రచించారు. జమ్మూకాశ్మీర్‌కు చెందిన అంశాలు, వివాదాలపై నూరానీకి పూర్తి అవగాహన ఉంది. జమ్మూకాశ్మీర్‌ను తరచుగా సందర్శిస్తుండేవారు.

5 రోజుల పాటు ఆన్‌లైన్ పాస్‌పోర్టు సేవలు బంద్

ఢిల్లీ: దేశంలో ఆన్‌లైన్ పాస్‌పోర్టు సేవలు ఐదు రోజుల పాటు నిలిచిపోనున్నాయి. సాంకేతిక నిర్వహణకు సంబంధించిన పనుల్లో భాగంగా ఈ నెల 29న రాత్రి 8 గంటల నుంచి సెప్టెంబర్ 2 ఉదయం 6 గంటల వరకు 'పాస్‌పోర్టు సేవా పోర్టల్' సేవలను నిలిపేస్తున్నారు. ఇప్పటికే బుకింగ్‌లో ఉన్న దరఖాస్తుదారుల అపాయింట్‌మెంట్స్‌ను రీషెడ్యూల్ చేయనున్నారు. ఈమేరకు విదేశీ వ్యవహారాల శాఖ ప్రకటన విడుదల చేసింది.

అపోహలతో విచారణను ఇతర ధర్మాసనానికి బదిలీ చేయలేం

- 'ఓటుకు నోటు' కేసులో సుప్రీం ధర్మాసనం
- తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం అపోహలతో విచారణ బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్టేనని'ఓటుకు నోటు' కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుత స్థితిలో ఓటుకు నోటు విచారణ బదిలీ పిటిషన్‌ను ముందస్తుగా రద్దు చేయడం లేదని స్పష్టం చేసింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో కవిత బెయిల్‌పై సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తప్పుబట్టింది. ఈ వ్యవహారంలో సిఎంను మందలించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని, అందుకనే ఆ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బిఆర్ఎస్ నేతలు, మాజీ డిప్యూటీ సిఎం మహ్మద్ అలీ, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది.

తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ లూత్రా, మేనకా గురుస్వామి హాజరవ్వగా, , పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావులు హాజరయ్యారు. గురువారం ఉదయం ఈ కేసు విచారణకు చేపట్టినప్పుడు ఈ కేసులో నిందితుడు సిఎంగా ఉన్నారని, హెూంశాఖ, అవినీతి నిరోధక శాఖలు స్వయంగా ఆయన చేతిలో ఉన్నాయని తెలిపారు. అంతేకాకుండా ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులను, దర్యాప్తు సంస్థల అధికారులను ఇంకా విచారించలేదన్నారు. దీనికి ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ లూత్రా, మేనకాగురుస్వామిలు అభ్యంతరం తెలిపారు. మొదటి నుంచి కేసు దర్యాప్తు అధికారుల్లో ఎలాంటి మార్పు లేదని కోర్టుకు నివేదించారు. ఆగష్టు 2021లో జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణను నిలిపివేసిందని నివేదించారు. ఈ సందర్భంగా జస్టిస్ బిఆర్ గవాయి స్పందిస్తూ కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం పోతుందని వ్యాఖ్యానించారు. 2021 నుంచి స్టే అమలులో ఉందని, 2024 ఎన్నికల తరువాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారని పేర్కొంది. విచారణ బదిలీని నిరాకరిస్తూనే, ఇరు పక్షాల్లో విశ్వాసాన్ని నింపేలా స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పిపి)ను ఏర్పాటు చేస్తామని, ఈ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని వ్యాఖ్యానించింది.

తెలంగాణ సిఎం సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం పట్ల గౌరవం లేకుండా, ఇలాంటి ప్రవర్తనే కలిగి ఉంటే, ఆయన తెలంగాణకు వెలుపల కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.. ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రోహిత్గి జోక్యం చేసుకొని సిఎం పక్షాన క్షమాపణ చెప్పగా, మరో న్యాయవాది సిద్దార్థ లూత్రా సిఎంకు కౌన్సిలింగ్ చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ సుప్రీంకోర్టు గురించి సిఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు, హైకోర్టు, దిగువ కోర్టుల్లో న్యాయమూర్తుల పరువు గురించి ఎలాంటి ఆందోళనలు ఉంటాయో ఆలోచించాలన్నారు. కాగా, పిపి నియామకం విషయంలో వి. సురేందర్ రావు(ప్రస్తుతం సిఎం కేసులో ప్రాసిక్యూటర్), ఉమా మహేశ్వర్ రావు పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకొని ధర్మాసనం, తదుపరి విచారణను సెప్టెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. పిటిషన్ కోరినట్లు విచారణ బదిలీ అంశాన్ని ప్రస్తుత స్థితిలో రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

స్టీల్‌ప్లాంటుపై తక్షణమే దృష్టి సారించండి

(మొదటి పేజీ తరువాయి)

విలీనం చేసే చర్యలు వేగవంతం చేయాలన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు నిర్వహణకు అవసరమైన వర్కింగు క్యాపిటల్ కోసం కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ పరిధిలో ఉన్న లెటర్ ఆఫ్ కంఫర్ట్ పద్ధతిలో అనుమతి ఇచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. ప్లాంటు పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని ఇంటిగ్రేటెడ్ ప్లాంటులో కనీసం 45 రోజులకు అవసరమైన ముడిసరుకులు నిల్వ ఉండాలని, ప్రస్తుతం దినదినగండంగా నడుస్తోందని తెలిపారు. ఏ రోజుకు ఆరోజు ముడిసరుకు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించి పోలవరం, అమరావతి ప్రాజెక్టులకు స్టీలు తీసుకోవచ్చని సూచించారు. ఆరు నెలలుగా ప్లాంటు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ప్రతినెలా వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, పైగా నెలలో సగం రోజులు మాత్రమే పని కల్పిస్తామని చెప్పడం అత్యంత బాధాకరమని తెలిపారు. ఉద్యోగుల జీతాల ద్వారా కట్‌చేసిన పిఎఫ్, థ్రిఫ్ట్ డబ్బులను కూడా ఆ ట్రస్టుకు జమచేయకుండా యాజమాన్యం వాడుకుంటోందని పేర్కొన్నారు. ఆరునెలలుగా వారి బకాయిలు రూ.400 కోట్లు పేరుకుపోయాయని, ప్లాంటులో చనిపోయిన వారి కుటుంబాలకు అందించే డబ్బును సైతం సకాలంలో అందించడం లేదని తెలిపారు. ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని, పరిస్థితి మరింత దిగజారి పోకముందే ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవాలని, పరిస్థితులు అధిగమించేందుకు కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువాలని శ్రీనివాసరావు కోరారు.

సంక్షోభ పరిష్కారం కోసమే !

- మోడీ కీవ్ పర్యటనపై స్పందించిన మాస్కో

మాస్కో : ఇటీవల ఉక్రెయిన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించడంపై మాస్కో స్పందించింది. ఉక్రెయిన్ సంక్షోభానికి రాజకీయ, దౌత్యపరమైన పరిష్కారం కనుగొనడం కోసం ఇతర దేశాల ప్రయత్నాలతో పాటూ తన వంతుగా కృషి చేయడానికి మోడీ ఈ పర్యటన జరిపినట్లు తాము భావిస్తామని రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జకరోవా బుధవారం వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌పై భారత్‌లోని మిత్రులతో చర్చలు జరపడానికి సిద్ధంగా వున్నట్లు ఆమె చెప్పారు. కీవ్‌లో పర్యటించి వచ్చిన తర్వాత మోడీ, రష్యా అధినేత పుతిన్‌కు, అమెరికా అధినేత బైడెన్‌కు తన పర్యటన విశేషాలు వివరించారు. ఉక్రెయిన్ ఘర్షణకు త్వరగా, శాంతియుత పరిష్కారం లభించాలని, దానికి అన్ని పక్షాలు కట్టుబడి వుండాలన్నది భారత్ వైఖరని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైనప్పటి నుండి భారత్, రష్యాను ఖండించడం కానీ ఆంక్షలు విధించడం కానీ చేయలేదు. పశ్చిమ దేశాల నుండి ఒత్తిడి వచ్చినా లొంగలేదు.

యుపిఎ హయాంలోనిదే జన్‌ధన్ : చిదంబరం

న్యూఢిల్లీ : ప్రస్తుతం మోడీ ప్రభుత్వం గొప్పగా చెప్పకుంటున్న జన్‌ధన్ యోజన యుపిఎ పాలనలోని పథకమే అని కాంగ్రెస్ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి పి చిదంబరం గురువారం విమర్శించారు. మోడీ ప్రభుత్వం పేరు మార్చిందని తెలిపారు. 2005 నుంచి 2014 మధ్యకాలంలో కొన్ని లక్షల ఖాతాలు ప్రారంభించామని చెప్పారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజనకు 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసించిన ఒక రోజు తరువాత చిదరంబం ఈ విమర్శలు చేశారు. ఈ పథకం ఆలోచన వాస్తవంగా ఆర్‌బిఐ గవర్నర్ సి రంగరాజన్‌ది అని చిదంబరం వెల్లడించారు. అయితే 2005లో 'నో ఫ్రిల్స్ అకౌంట్' లేదా 'జీరో బాలెన్స్ అకౌంట్'ను ప్రారంభించినప్పుడు ఆర్‌బిఐ గవర్నర్‌గా డాక్టర్ వైవి రెడ్డి అని తెలిపారు. ఈ పథకం పేరును 2012లో బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపోజిట్ అకౌంట్ (బిఎస్‌బిడిఎ)గా మార్చినట్లు చెప్పారు. ఈ యుపిఎ పథకాన్ని జన్ ధన్ యోజనగా మోడీ ప్రభుత్వం మార్చిందని చిదంబరం వివరించారు.

లక్ష్యానికి దూరంగా దుస్తుల ఉత్పత్తి

న్యూఢిల్లీ : 2030 నాటికి వస్త్రాలు, దుస్తుల ఎగుమతులను వంద బిలియన్ డాలర్లకు చేర్చాలని భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో ఒక్క దుస్తుల వాటాయే 50-60 శాతం. ఉత్పత్తిని పెంచితే దేశంలో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అయితే ఈ రంగంలో మన రికార్డును పరిశీలిస్తే అదేమంత తేలిక కాదని అర్థమవుతుంది. 2015-2020 మధ్యకాలంలో మన దేశం నుండి దుస్తుల ఎగుమతి 16-19 బిలియన్ డాలర్లు దాటలేదు. అదే సమయంలో వియత్నాం తన ఎగుమతులను 70 శాతం పెంచింది. బంగ్లాదేశ్ కూడా రెట్టింపు చేసింది. బంగ్లాదేశ్, వియత్నాంతో పోలిస్తే మన దేశంలో దుస్తుల తయారీ ఖర్చు చాలా ఎక్కువ. ఉదాహరణకు దేశంలోని దుస్తుల తయారీ పరిశ్రమ రెండు వేల మందికి ఉపాధి కల్పిస్తూ ఏడాదికి 60 లక్షల పాలియస్టర్ టీ-షర్టులు ఉత్పత్తి చేస్తుందని అనుకుందాం. అప్పుడు ఒక్కో టీ-షర్ట్ ఉత్పత్తికి రూ.238 ఖర్చవుతుంది. అదే బంగ్లాదేశ్, వియత్నాంలో కేవలం రూ.24 మాత్రమే అవుతుంది. అదీకాక ఫ్యాబ్రిక్స్...ముఖ్యంగా సింథటిక్ ఫ్యాబ్రిక్స్ దిగుమతులపై మన ప్రభుత్వం అధిక సుంకాన్ని వసూలు చేస్తోంది. వియత్నాం 12 శాతం వసూలు చేస్తుంటే మన ప్రభుత్వం 20 శాతం వసూలు చేస్తోంది. ముడి సరుకు ఖర్చు అధికంగా ఉండడంతో స్థానిక దుస్తులు కూడా ఎక్కువ ధర పలుకుతున్నాయి.

రాజకీయాలకు కేంద్రంగా మారుతున్న కోల్‌కతా కేసు !

- రాజకీయాలకు అతీతంగా న్యాయం జరగాలని కోరుతున్న బాధిత తల్లిదండ్రులు, సహచరులు



కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని కొల్‌కతాలో వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచార ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న అకృత్యాలపై ఆమె కనీస ప్రస్తావన కూడా చేయడం లేదు. ఇక బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఇదే ఘటనపై ర్యాలీలు నిర్వహించారు. యుపి తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఎన్ని ఘోరాలు, అఘాయిత్యాలు జరిగినా ఏమాత్రం పట్టించుకోని సంఘ్ పరివార్.. కొల్‌కతా ఘటనపై మాత్రం పెట్రేగిపోతోంది. సచివాలయ ముట్టడులు, సమ్మెలు చేపడతూ రాజకీయ పబ్బం కోసం పడరాని పాట్లు పడుతోంది. ఈ దారుణ ఘటనను రాజకీయాల కోసం వినియోగించుకోవడంలో సంఘ్ పరివార్, తృణమూల్ కాంగ్రెస్ ఎవరికి వారే పోటీ అన్నట్టు వ్యవహరిస్తున్నారు. అయితే నీచమైన ఈ రాజకీయ చర్యలను బాధిత కుటుంబం, ప్రజలు ఈసడిస్తున్నారు. తమకు రాజకీయాలకు అతితంగా న్యాయం జరగాలని కోరుకుంటున్నారు.

విధులు నిర్వర్తించే ప్రదేశాల్లో చోటు చేసుకున్న హింస, రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో నెలకొన్న అవినీతి వంటి అంశాలపై దృష్టిసారిస్తూ రాజకీయాలకు అతీతంగా నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని వైద్యురాలి సహచరులు పిలుపిస్తున్నారు. రాజకీయ ఎజెండాలకు దూరంగా మహిళలకు భద్రత, న్యాయం కావాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా మహిళా లోకం నినదిస్తోంది. ఇంతమంది ఇన్ని రకాలుగా రాజకీయ జోక్యం వద్దని కోరుతున్నా, ఇప్పటికే ఆర్‌జి కార్ ఆస్పత్రి అటువంటి రాజకీయ పోరాటాల వేదికగా మారిందని వ్యాఖ్యానించడం తప్పు కాదు.

కోల్‌కతా ఘటనను, 2012లో నిర్భయ ఘటనను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ మాట్లాడిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బిజెపి పాలిత రాష్ట్రాల్లో చోటు చేసుకున్న అనేకానేక అత్యాచారాల నేరాలను కనీసం ప్రస్తావించలేదు. మంగళవారం ఆందోళన చేస్తున్న విద్యార్థి కార్యకర్తలపై పోలీసులు దారుణంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ బుధవారం బిజెపి 12గంటల బంద్‌కు పిలుపిచ్చింది. విద్యార్థుల ర్యాలీగా చెప్పుకునే ఈ కార్యక్రమం అల్లరి మూక నేతృత్వంలో సాగిన ఆందోళనగా మారిపోయింది. అనేకమంది పోలీసు అధికారులు గాయపడ్డారు. ఇప్పటివరకు శాంతియుతంగా కొనసాగుతున్న పౌరుల ఆందోళనను ఇలా ఒక గ్రూపు హైజాక్ చేసింది. ఈ ఆందోళన చేపట్టిన పశ్చిమ బంగా ఛాత్ర సమాజ్‌కు బిజెపితో బలమైన సంబంధాలు వున్నాయి. పైగా రాష్ట్ర సచివాలయానికి ప్రదర్శన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతమని పైకి చెప్పుకుంది. కానీ సాయంత్రమయేసరికి ఆ ముసుగు తొలగిపోయింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆందోళనకారులను విడుదల చేయాలని కోరుతూ బిజెపి నేతలు కోల్‌కతా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు ప్రదర్శనగా వెళ్ళారు. రాష్ట్రవ్యాప్తంగా బంద్ సందర్భంగా పలు చోట్ల బిజెపి కార్యకర్తలు పోలీసులతో ఘర్షణ పడ్డారు. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండి బంద్‌లను వ్యతిరేకిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం నాటి బంద్ ప్రభావాన్ని లేకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించింది. పలు చోట్ల ఆందోళనకారులతో తృణమూల్ కార్యకర్తలు ఘర్షణలు పడినట్లు వార్తలు వచ్చాయి.

ఆందోళన జరుపుతున్న డాక్టర్లను ఉద్దేశించి ముఖ్యమంత్రి మమత మాట్లాడుతూ వెంటనే విధుల్లో చేరాల్సిందిగా కోరారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఇప్పటికే అనుమతినిచ్చిందని హెచ్చరించారు. 'నేను చర్యలు తీసుకోవాలనుకోవడం లేదు. కానీ ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తే మీ భవిష్యత్ నాశనమవుతుంది. పాస్‌పోర్టులు లేదా వీసాలు రావు, చట్టపరంగా చర్యలు తీసుకుంటే జీవితాలు ధ్వంసమవుతాయి' అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు సర్వత్రా ఖండనలు, విమర్శలు వెల్లువెత్తాయి.

తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు, ఆందోళనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి తన అసంతృప్తిని ఈ రకంగా ప్రదర్శించారు. రేపిస్టులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ ప్రతి బ్లాక్‌లోనూ ప్రదర్శనలు నిర్వహించాలని తన పార్టీ మద్దతుదారులకు పిలుపిచ్చారు. దీన్ని మాజీ ఎంపి, వామపక్ష సీనియర్‌నేత సుజన్ చక్రవర్తి తీవ్రంగా ఖండించారు. ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జరిగిన ఘటనను ఖండిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతుంటే ఇటువంటి పరిస్థితుల్లో స్వయంగా ముఖ్యమంత్రే హింసను రెచ్చగొడుతున్నాని విమర్శించారు. ఈ దేశంలో చట్టబద్ద పాలన అంటూ వుందా? మహిళలు అత్యాచారాలు జరిగిన సంఘటనలు గతంలోనూ అనేకం జరిగాయని, అప్పుడు మౌనం వహించిన దీదీ ఇప్పుడు తాను సమస్యల్లో పడేసరికి ఇలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్‌నేత అదీర్ చౌదరి విమర్శించారు.

ప్రపంచంలో దేశాల మధ్య
సంఘీభావం, సమన్వయం అవశ్యం !

- చైనా నేత జిన్‌పింగ్ స్పష్టీకరణ
- అమెరికా జాతీయ భద్రతా సలహాదారుతో భేటీ



బీజింగ్ : అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో చైనా అధ్యక్షులు జీ జిన్‌పింగ్ గురువారం ఇక్కడి గ్రేట్‌హాల్ ఆఫ్ ది పీపుల్ భవనంలో సమావేశమయ్యారు. ప్రస్తుతం వేగంగా మారుతున్న పరిణామాలు, అల్లకల్లోలంగా వున్న నేటి ప్రపంచంలో దేశాల మధ్య సంఘీభావం, సమన్వయం వుండాల్సిన అవసరం వుందని, కానీ విభజన లేదా సంఘర్షణలు కాదని జిన్‌పింగ్ పేర్కొన్నారు. పారదర్శకత, పురోగతిని ప్రజలు కోరుకుంటారని, అంతేకానీ బహిష్కరణలు లేదా తిరోగమనాలు కోరుకోరని ఆయన వ్యాఖ్యానించారు. రెండు ప్రధాన దేశాలుగా చైనా, అమెరికాలు చరిత్రకు, ప్రజలకు, యావత్ ప్రపంచానికి బాధ్యత వహించాల్సి వుందన్నారు. ప్రపంచ శాంతి, ఉమ్మడి అభివృద్ధి ప్రయోజనాలకు ఒక స్థిరమైన వనరుగా వుండాలని జిన్‌పింగ్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల్లోనూ అలాగే చైనా-అమెరికా సంబంధాల్లోనూ గొప్ప మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. సుస్థిరమైన, ఆరోగ్యకరమైన, నిలకడతో కూడిన చైనా-అమెరికా సంబంధాల పట్ల చైనా నిబద్ధత విషయంలో ఎలాంటి మార్పు లేదని ఆయన స్పష్టం చేశారు. పరస్పర గౌరవం, శాంతియుత సహజీవనం, సమాన అవకాశాలు, సహకారం ప్రాతిపదికన సంబంధాలు కొనసాగాలన్న మౌలిక సూత్రంలో మార్పు లేదన్నారు. దేశ సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాల విషయంలో చైనా వైఖరి ధృఢంగా వుందన్నారు. చైనా, అమెరికా ప్రజల మధ్య నెలకొన్న సాంప్రదాయ స్నేహ బంధాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాల్లో కూడా ఎలాంటి మార్పు లేదని జిన్‌పింగ్ స్పష్టం చేశారు. అమెరికా కూడా ఇదే దిశా నిర్దేశంతో చైనాతో కలిసి పనిచేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. చైనాను, చైనా అభివృద్ధిని సానుకూల, సహేతుకమైన కోణంలో చూడగలదని ఆశిస్తున్నట్లు తెలిపారు. పరస్పర అభివృద్ధిని సవాలుగా తీసుకోవడం కన్నా ఒక అవకాశంగా చూడాల్సి వుందన్నారు. రెండు దేశాలు కలిసి ముందుకు సాగేందుకు సరైన మార్గాన్ని కనుగొనడంలో చైనాతో కలిసి పనిచేయగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు.

తైవాన్ విషయంలో జోక్యం చేసుకుంటే ఊరుకోం !

- ఆమెరికాకు స్పష్టం చేసిన చైనా

బీజింగ్ : తైవాన్ మిలటరీతో సంబంధాలు పెట్టుకోవడాన్ని అమెరికా తక్షణమే నిలిపివేయాలని, చైనా కీలక ప్రయోజనాలను గౌరవించాలని చైనా కోరింది. తైవాన్ అంశం చైనాకు చాలా కీలకమైనదని చైనా సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్ ఛైర్మన్ ఝూంగ్ యోక్సియా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బీజింగ్‌లో పర్యటిస్తున్న అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివాన్‌తో గురువారం సమావేశమైన ఝూంగ్, తైవాన్‌కు ఆయుధాలు అందచేయడాన్ని ఆపాలని, తైవాన్‌కు సంబంధించిన తప్పుడు వార్తలను, పుకార్లను ఆపాలని కోరారు. ఈ మేరకు చైనా రక్షణ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చైనా-అమెరికా సంబంధాలకు తైవాన్ అంశం రాజకీయ పునాదిని వేస్తుందని పేర్కొన్నారు. గీసిన లక్ష్మణ రేఖను దాటరాదన్నారు. తైవాన్ జలసంధిలో శాంతి సుస్థిరతలు కొనసాగాలని చైనా కోరుకుంటుందని, అయితే తైవాన్‌ను చైనా నుండి విడదీయడానికి ప్రయత్నం జరిగితే మాత్రం ఇది సాధ్యం కాదని హెచ్చరించింది.

తైవాన్ స్వాతంత్ర్యాన్ని కోరుకునే మద్దతుదారులను చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఝూంగ్ చెప్పారు. వేర్పాటువాద శక్తుల నిర్లక్ష్యపూరితమైన, రెచ్చగొట్టే వ్యాఖ్యలను ప్రతిఘటిస్తామన్నారు.

చైనా పట్ల గల వ్యూహాత్మక వైఖరిని అమెరికా సరిదిద్దుకోవాలన్నారు. ఇరు దేశాల సాయుధ బలగాల మధ్య సహకారాన్ని పెంపొందించాలని కోరారు.

నరకానికి నకళ్లు.. ఇజ్రాయిలీ నిర్బంధ శిబిరాలు

- పాలస్తీనా ఆరోగ్య కార్యకర్తలపై చిత్రహింసలు
- హ్యూమన్‌రైట్స్ వాచ్ నివేదిక



గాజా సిటీ: గ్వాంటెనామో నిర్బంధ శిబిరంలో అమెరికా సాగించిన అకృత్యాలను తలపించేలా ఇజ్రాయిల్ వ్యవహరిస్తోంది. వందలాది మంది పాలస్తీనా ఆరోగ్య కార్యకర్తలను బందీలుగా చేసి, జైళ్లు, నిర్బంధ శిబిరాల్లో కుక్కడమే గాక, వారిని చిత్ర హింసలకు గురి చేస్తున్న వైనాన్ని 'హ్యూమన్ రైట్స్ వాచ్ ' బయట పెట్టింది. అంతర్జాతీయంగా మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న ఈ సంస్థ ఇజ్రాయిల్ నడుపుతున్న నిర్బంధ శిబిరాల్లో పాలస్తీనీయులపై సాగుతున్న భయంకరమైన హింస గురించి అనేక విషయాలు వెల్లడించింది. నర్సులు, పారామెడికల్ సిబ్బంది, డాక్టర్లను ఈ శిబిరాల్లో బంధించి వారిని ఇజ్రాయిల్ దురాక్రమణ దళాలు చిత్ర హింసలు పెట్టాయి. చేతులు కాళ్లకు బేడీలు వేసి, కళ్లకు గంతలు కట్టేసి కొట్టడం, ఇనుప కొనలతో ఉన్న బూట్లతో తన్నడం, తిండి, నీళు ఇవ్వకుండా హింసించడం, ఎప్పుడుపడితే అప్పుడు కొట్టడం, లైంగికంగా వేధించడం, కరెంట్ షాక్‌కు గురిచేయడం, లైటర్స్‌తో వంటిపై చురకలేస్తూ పైశాచికానందం పొందడం అక్కడ రివాజుగా మారిపోయిందని హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. ఈ నరక కూపం నుంచి ఎలాగో ఒకలా బయటపడిన పారామెడికల్ డాకర్ వలీద్ ఖలీలి, సర్జన్ ఇయాద్ అబేద్, నర్సు ఖాదర్ అబూనాద వంటి వారి వ్యథాభరిత యదార్థ గాథలను హ్యూమన్ రైట్స్ వాచ్ ఉటంకించింది.



శ్రమైక్య గీతాల సౌందర్య తేజం

ఆయనిది మూర్తీ భవించిన సంస్కారం... అణుకువతో మాట్లాడేతత్వం... అద్భుతమైన సాహిత్య సుగంధం... స్వచ్ఛత, స్పష్టతతో మాటతీరు... తన పాటల్లో, మాటల్లో మానవీయకోణం, ఆత్మీయ గుణం... అభ్యుదయ భావాల పరిమళం, పల్లెపదాల సోయగం ... జనం పాటల జాబిలి ఆయన. పరిమళించే మానవత్వపు ప్రవాహం ఆయన. **సుద్దాల అశోక్‌తేజ.**

తెలుగు సినిమా పాటకు జనం భాషను అద్దిన పాటగాడు. పదపదాన ప్రజాదృక్పథం కనబరిసిన ప్రగతిశీల భావుకుడు.

తెలుగు సినిమా కథ, పాటల రచయితగా 3 వేల వరకూ పాటలు రాశారు అశోక్ తేజ. సినిమాలకు పల్లె పదాలతో పాటలు రాసి సరికొత్త సొబగులు అద్దారు. మరో 2500 వరకూ సాహిత్యపరమైన జానపద పాటలకు జీవం పోశారు. ఆయన రాసిన ఎన్నో సినిమా పాటలు జనం నాల్కల మీద నానుతూనే ఉన్నాయి.

'కొమరం భీముడో... కొమురం భీముడో
కొర్రాసు నెగడోలే మండాలి కొడుకో
మండాలి కొడుకో
కొమురం భీముడో కొమురం భీముడో
రగ రగ సూరీడై రగలాలి కొడుకో
రగలాలి కొడుకో'


'ఆర్‌ఆర్‌ఆర్' సినిమాలో గోండు వీరుడు కొమురం భీమ్ ధీరత్వానికి అద్దం పట్టిన పాట ఇది. కొమురం భీమ్‌ని ఆంగ్లేయులు చిత్రహింసలు పెడుతున్నప్పుడు... వాటికి భయపడి లొంగిపోతే వీరుడివి ఎలా అవుతావు? అడవి తల్లి బిడ్డవి ఎలా అవుతావు? అన్న మాటలతో సాగే పాట ఇది. ఒక వైపు వాళ్ల చిత్రహింసలు సాగుతుంటే, మరోవైపు తనకు తానే ధైర్యం చెప్పుకొనే సందర్భంలో ఈ పాట వస్తుంది. కొమురం భీమ్‌పై 'పరమవీర చక్ర'లో ఎనిమిది నిముషాల కథని గేయ రూపకంలో అశోక్‌తేజ రాశారు. నాగబాల సురేష్‌కుమార్ దర్శకత్వం వహించిన 'కొమురం భీమ్' సీరియల్‌కు కూడా పాట రాశారు. ఇలా కొమురం భీమ్‌పై ఆయన మూడు సందర్భాల్లో మూడు పాటలు రాశారు.

'కొమ్మ ఉయ్యాలా కోన జంపాలా
అమ్మ ఒళ్ళో నేను రోజూ ఊగాలా
రోజూ ఊగాలా
కొమ్మసాటున.. పాడే కోయిల
కూ అంటే.. కూ అంటూ
నాతో ఉండాలా... నాతో ఉండాలా
తెల్లారాలా పొద్దుగాల
అమ్మ నీ అడుగుల్లో అడుగేయలా
కొమ్మ ఉయ్యాలా కోన జంపాలా" అంటూ అశోక్‌తేజ రాసిన మరొక పాట ఎంతో ప్రసిద్ధి చెందింది.

'దాని కుడీ భుజం మీద కడువా
దాని గుత్తెపు రైకలు మెరియా
అది రమ్మంటే రాదురా సెలియా
దాని పేరే సారంగ దరియా' అంటూ 'లవ్‌స్టోరీ' సినిమాకి రాసిన పాట గ్లోబల్ హిట్‌గా నిలిచింది. 2017లో 'ఫిదా' సినిమా కోసం రాసిన ....

'వచ్చిండే మెల్ల మెల్లగా వచ్చిండే..
క్రీమ్ బిస్కట్ వేసిండే...
గమ్మున కూసోనియ్యడే...
కుదురుగా నిలుసోనియ్యడే...
సన్నా సన్నగా నవ్విండే...
కునుకే గాయబ్ జేసిండే...
ముద్ద నోటికి పోకుండా...
మస్తు డిస్టర్బ్ చేసిండే...
డిన్నర్ అన్నాడే... డేట్ అన్నాడే...
వేలు పట్టి పోలు తిరిగి...
నిన్ను ఉల్టా సీదా జేసిండే...'

పాట యువతను ఒక ఊపు ఊపేసింది. ఈ పాటకు 2018లో ఉత్తమ గీత రచయితగా సైమా అవార్డును అందుకున్నారు.



'నేలమ్మ నేలమ్మ నేలమ్మా
నీకు వేల వేల వందనాలమ్మా
సాలేటి వానకి తుళ్ళింత
ఇంకా సాలుసాలుకి నువ్వు బాలింత
నీళ్లనే చనుబాలుగా... గాలినే ఉయ్యాలగా,
పక్కల డొక్కల రెక్కల్లా నువ్వు
సక్కంగ మోసేపు మొక్కల్ల' అంటూ భూమాత, అమ్మ గొప్పతనాన్ని తెలియజేస్తూ రాసిన ఈ పాట టాలీవుడ్‌లో సరికొత్త రికార్డును నెలకొల్పింది.

పరాజయం.. ఎంతోమందిని చీకట్లోకి నెట్టేస్తుంది. చిన్న చిన్న వైఫల్యాలకే చాలామంది కుంగిపోతారు. భయపడిపోతారు. కానీ, నేర్చుకోగలిగితే వైఫల్యం ఒక పాఠం! నేర్పుతో కదిలితే విజయసాధనకు అదో ఆయుధం. దారి చూపే దీపం. ఇదే స్ఫూర్తితో అశోక్ తేజ రాసిన పాట...

'ఒకటే జననం ఒకటే మరణం
ఒకటే గమనం ఒకటే గమ్యం
గెలుపు పొందేవరకూ అలుపు లేదు మనకు
బ్రతుకు అంటే గెలుపూ
గెలుపు కొరకె బ్రతుకు
కష్టాలు రానీ కన్నీళ్లు రానీ ఏమైనాగానీ ఎదురేది రానీ
ఓడిపోవద్దు రాజీపడొద్దు
నిద్రే నీకొద్దు నింగే నీ హద్దు' అంటూ 'భద్రాచలం' సిఇనమాలో సాగిన ఈ పాట యువతకు సరికొత్త ఉత్సాహాన్నిస్తోంది. లక్షలాదిమందికి రింగ్‌టోన్ అయ్యింది.

'రాయి సలాకు ఇటుక ఇటుక
తాపీ తట్ట సిమెంట్ చెమట
గోడ మీద గోడ... మేడ మీద మేడ
కట్టిపోరా కూలోడా పట్టణాల్లో మేడ
కాళ్లూ జాగరతా వేళ్లూ జాగరతా...' భవన నిర్మాణ కార్మికుల గురించి ఆయన రాసిన పాట బాణీ ఇది. దీనినే 'ఒకటే జననం ఒకటే మరణం'గా భద్రాచలం సినిమాలోకి మార్చి రాశారు.

'ఓ ముత్యాల రెమ్మ ఓ మురిపాల కొమ్మ
ఓ పున్నమి బొమ్మ ఓ పుత్తడి గుమ్మా
ఓ రాములమ్మ రాములమ్మ
ఎం సూపులోయమ్మ ఎగు సుక్కలేనమ్మా
సిరి నవ్వులోయమ్మ సెంద్ర వంకలేనమ్మా
ఓ రాములమ్మ రాములమ్మ..
వాగుల్లో వంకల్లో ఆ సెల్లాల్లో మూలల్లో
నువ్వు పచ్చగుండాలె
నువ్వు పదిలంగుండాలె
భూమి తల్లి సాక్షిగా సేమాంగుండాలె..'

అంటూ గ్రామాల్లో భూస్వామ్య దురాగతాలను ఎదిరిస్తూ అన్నెం పుణ్యం తెలియని 12 ఏళ్ల బాలిక గర్భవతిగా మారిన తీరును వర్ణిస్తూ సాగిన ఈ పాట సమాజంలో జరుగుతున్న అకృత్యాలపై తిరుగుబావుటాలా ప్రజల్లోకి దూసుకెళ్లింది.

'నేను సైతం ప్రపంచాగ్నికి
సమిధకొక్కటి ఆహుతిచ్చానూ
నేను సైతం విశ్వవృష్టికి
అశ్రువొక్కటి ధారపోసాను
నేను సైతం భువన ఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను
మన్నెం వీరుడు రామరాజు
ధనుష్టంకారానివా
భగత్‌సింగ్ కడసారి పలికిన
ఇంక్విలాల్ శబ్దానివా'

అంటూ అక్రమార్కుల తీరుపై అక్షరరూపం చెక్కిన పాట ఇది. చిరంజీవి హీరోగా నటించిన 'ఠాగూర్ (2003)' సినిమాలో పాడిన ఈ పాటకు 2004లో జాతీయ పురస్కారం లభించింది.

'నీలిరంగు చీరలోనే.. సందమామ నీవేజాణ
ఎట్ట నిన్ను అందుకోనే
ఏడు రంగులున్న నడుము
బొంగరంలా తిప్పేదాన
నిన్ను ఎట్టా అందుకోనే..
జీవితం అను రంగుల రాట్నం ఎక్కి ఊరేగరా
జీవితం ఒక జాతర చెయ్యడానికే జన్మరా..'

అంటూ 'గోవిందుడు అందరివాడు' సినిమా సాంగ్ జీవితం తాలూకా వ్యవస్థల గురించి తెలియజెప్పింది.

'టప టప టప టప చెమట బొట్టు తాళాలై పడుతుంటే
కరిగి కండరాల నరాలే స్వరాలు కదుతుంటే
పాట పనితో పాటే పుట్టింది
పని పాటతో జత కట్టింది' అంటూ శ్రమజీవులను గుర్తుచేస్తూ పాడిన పాట మనసుకు హత్తుకుంటుంది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే! అశోక్‌తేజ రాసిన అభ్యుదయ, జానపద సూపర్‌హిట్ పాటలు 2 వేలకు పైబడే ఉన్నాయి.

స్వేదం విలువను చాటే 'శ్రమకావ్యం'

అశోక్‌తేజ రాసిన పాటలన్నీ ఒక ఎత్తు. మానవ జీవన పరిణామ క్రమంలో శ్రమ పాత్రను గుర్తుచేస్తూ ఆయన చెక్కిన 'శ్రమకావ్యం' మరొక ఎత్తు. ఇదొక శాస్త్రీయ, అభ్యుదయ భావధార. శ్రముడు, శ్రమి కలగలసి సాగించిన ప్రగతి బాటల పరంపర. ఇది అందరం తెలుసుకోవాల్సిన శ్రమ కథనం. అశోక్‌తేజ స్వరంలో విని తీరాల్సిన శ్రమైక జీవన సౌందర్య మధురం. కరువు నేలపై మనిషి మనుగడ, కులవృత్తులు, మనిషి పుట్టుక నుంచి చావు వరకూ ప్రతి కదలిక, కలయిక, కష్టంపై ఈ కావ్యంలో ప్రస్తావించారు. **అశోక్‌తేజ తాను రచించిన 'శ్రమకావ్యం' గీతాలను నేటి సాయత్రం 5.30 గంటలకు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో గానం చేస్తారు. వినే ఆసక్తి గల అందరికీ ఆహ్వానం పలుకుతోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జాషువా సాంస్కృతిక వేదిక.**

- యడవల్లి శ్రీనివాసరావు

రక్ష కావాలి!




పొత్తిల్లలో ఉన్న నన్నొదిలి నీవు
సెల్ ఫోన్‌నే చూస్తు ఉండి పోతున్నావు!
ఆకలేయగ నేను అల్లాడుతుంటేను
ఉండురా కన్న అని దాటవేస్తున్నావు!
సెల్ ఫోన్ నా కన్న గొప్పదా ఏమి?
కాస్సేపు ఆగితే అది ఏడ్చునా ఏమి?
తెలియక నేనేమో అడుగుతున్నాను
నే గోల పెడితే తట్టుకొనగలవా?!
సెల్ ఫోన్ వదిలేసి హత్తుకొనుమమ్మా!
పాలిచ్చి ప్రేమగా లాలించుమమ్మా!
నీ పలుకరింపే నాకు గొప్ప బలమమ్మా!
నీ మెత్తని ఒడియే నాకు పెద్ద రక్షమ్మా!

– బెలగాం భీమేశ్వరరావు,
99895 37835

ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మల పేర్లను పక్కనే గళ్లల్లో ఇచ్చాం. అయితే వాటిల్లో కొన్ని అక్షరాలు తప్పిపోయాయి. సరైన అక్షరాలను మీరే గుర్తించి రాయాలి మరి! ట్రై చేయండి చూద్దాం.



f r _ g
z _ b r _
c _ t
p _ g
t _ g _ r
l _ _ n

నేను గీసిన బొమ్మ



బండి సాయి శివ,
6వ తరగతి,
జెడ్పిహెచ్ఎస్,
బక్రిచెప్యాల,
సిద్ధిపేట జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



అవి మహిళల కనీస అవసరాలు : సమంత

కేరళలోని విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ (డబ్ల్యూసీసీ) అద్భుతమైన పనితీరును తాను చాలా సంవత్సరాలుగా గమనిస్తున్నట్లు సమంత తన ఇన్‌స్టాలో రాసుకొచ్చారు. డబ్ల్యూసీసీ వల్లే హేమ కమిటీ నివేదిక ఇవ్వగలిగిందని, చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న ఎన్నో ఇబ్బందులు బయటకు వచ్చాయన్నారు. సురక్షితమైన, గౌరవప్రదమైన పని ప్రదేశాలు మహిళలకు కనీస అవసరాలని సమంత అభిప్రాయపడ్డారు. వీటికోసం ఇప్పటికీ ఎంతో మంది పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. అయిననప్పటికీ వారి ప్రయత్నాలు ఫలించలేదని, కనీసం ఇప్పటికైనా ఈ విషయాలపై తగిన నిర్ణయాన్ని తీసుకుంటారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. ఉమెన్ ఇన్ సినిమా కలెక్టివ్‌లో ఉన్న వారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. డబ్ల్యూసీసీకి ఎప్పటికీ రుణపడి ఉంటామని వెల్లడించారు.



యోగిబాబు, లక్ష్మీమేనన్ జంటగా 'మలై'

హాస్యనటుడు యోగిబాబు, నటి లక్ష్మీమేనన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మలై'. సెప్టెంబర్‌లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ప్రచార కార్యక్రమాలను మేకర్లు ప్రారంభించారు. 'బ్లూస్టార్' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన లెమన్ లీఫ్ సంస్థ ఈ సినిమాను తెరకెక్కించింది. నూతన దర్శకుడు ఐపి మురుగేష్ దర్శకత్వం వహించారు. ఆర్.గణేష్‌మూర్తి, సౌందర్య గణేష్ నిర్మించారు. కాళీ వెంకట్, బాలనటుడు చతుర్థి గణేష్‌మూర్తి తదితరులు నటించారు. డి.ఇమ్మాన్ సంగీతాన్ని అందించారు. దర్శకుడు మురుగేష్ సినిమా విశేషాలను వివరించారు. సాటి వారిపై ప్రేమ మరిచి, భవిష్యత్ తరాల జీవితాల గురించి ఏమాత్రం ఆలోచన లేని దురాశ ప్రకృతి వినాశనానికి దారితీస్తుందన్నారు. ఇలాంటి మంచి కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలిపారు.

నేడు ఎస్ఐ కోదండపాణి విడుదల

శ్రీ సాయి హనుమాన్ మూవీ పతాకంపై మక్కా శ్రీదేవి నిర్మాణ సారధ్యంలో మక్కా శ్రీను హీరోగా, సుచిత్ర రాథోడ్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఎస్ఐ కోదండపాణి'. శుక్రవారంనాడు ఈ సినిమా థియేటర్లలో విడుదలకానుంది. దిల్ రమేష్, ఎజిఎం శ్రీనివాస్, సూరినాయుడు, టిక్‌టాక్ సూరిబాబు, స్వర్ణ (జూనియర్ శకుంతల), షరీఫ్, నాగు, రమేష్, మణిమంత, నందిని, సీత, దివ్య, అనూష, నాగేంద్ర రెంటాల ప్రధాన పాత్రలు పోషించారు. దర్శకత్వం రెంటా నాగేంద్ర, కెమెరా సబరి, సంగీతం సాల్మన్‌రాజు, ఫైట్స్ కోడి రాము, అభి, ఆర్ట్ డైరెక్టర్ రమేష్, ఎడిటర్‌గా ఉదయ్ వ్యవహరించారు.



బాలయ్య ఈవెంట్‌కు బన్నీకి ప్రత్యేక ఆహ్వానం



సినీనటుడు నందమూరి బాలకృష్ణ సినీప్రస్థానం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్(బన్నీ)కు ప్రత్యేకంగా ఆహ్వానం అందించారు. ఈ వేడుకలకు హాజరుకావాలంటూ అల్లు అర్జున్‌ను టీఎఫ్‌పీసీ, టీఎఫ్‌సీసీ, మా అసోసియేషన్ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ప్రస్తుతం అర్జున్ పుష్ప-2 సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంటున్నారు. అల్లు అర్జున్-సుకుమార్ కాంబోలో వచ్చిన పుష్ప మూవీకి సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్ ఆరోతేదీన విడుదల కానుంది.

'కుబేర' నాగార్జున న్యూ లుక్

నాగార్జున కీలక పాత్ర చేస్తున్న "కుబేర" చిత్రం నుండి తాజాగా ఆయన న్యూ లుక్ విడుదలైంది. గురువారం నాగార్జున పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆయనకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఈ లుక్ విడుదల చేసింది. ఈ చిత్రంలో ధనుష్ హీరోగా, రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. అలాగే శ్రీవెంకటేశ్వర సినిమాస్ ఎల్ ఎల్ పి, అమిగోస్ సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు.



కోలీవుడ్‌లోనూ కమిటీ వేస్తాం.. విశాల్



కోలీవుడ్ నటుడు విశాల్ సినిమా ఇండస్ట్రీలో మహిళలపై వేధింపులపై కీలక వ్యాఖ్యలు చేశారు. మాలీవుడ్‌లో హేమ కమిటీ తరహాలో కోలీవుడ్‌లో కూడా 10 మందితో కూడిన కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 'తమిళ చిత్ర పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ ఉన్నట్టు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. కేరళలో ఏర్పాటు చేసిన హేమ కమిటీ లాగే తమిళనాడు నడిగర్ సంఘం ఆధ్వర్యంలో కమిటీ పెడతాం. నటీమణులు ఏవైనా సమస్యలు ఉంటే మాకు ఫిర్యాదు చేయండి. విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామ'ని విశాల్ పేర్కొన్నారు.

బ్యాడ్మింటన్‌లో మనీషా, తులసి గెలుపు

పారిస్ పారా ఒలింపిక్స్

పారిస్: 17వ పారా ఒలింపిక్స్‌లో భారత పారా షట్లర్లు రాణించారు. మహిళల సింగిల్స్(ఎస్‌యు-5)లో టాప్‌సీడ్‌గా బరిలోకి దిగిన మురుగేశన్ తులసిమతి గ్రూప్ స్టేజ్ తొలి మ్యాచ్‌లో సునాయాసంగా గెలిచింది. గురువారం జరిగిన గ్రూప్-ఎలో తులసిమతి 21-9, 21-11తో ఇటలీకి చెందిన మార్కో రోసాపై సునాయాసంగా నెగ్గింది.

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	4	1	0	5
2. నెదర్లాండ్స్	2	0	0	2
3. బ్రిటన్	1	3	1	5
4. ఇటలీ	1	2	4	7
5. ఫ్రాన్స్	1	2	0	3
6. బ్రెజిల్	1	0	0	1
7. ఆస్ట్రేలియా	1	1	2	4
8. డెన్మార్క్	1	0	0	1
9. హంగేరి	1	0	0	1
10. జపాన్	1	0	0	1

గమనిక: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం



పారా ఒలింపిక్స్ ప్రారంభోత్సవ వేడుకల్లో త్రివర్ణ పతాకంతో భాగ్యశ్రీ

గ్రూప్-సిలో 2వ ర్యాంకర్ మనీషా 8-21, 21-6, 21-19 తో స్థానిక క్రీడాకారిణి లీఫోర్ట్‌ను చిత్తుచేసింది. ఈ మ్యాచ్ సుమారు 50నిమిషాలసేపు సాగింది. ఇక పురుషుల సింగిల్స్ గ్రూప్-డి (ఎస్ఎల్-4)లో తరుణ్ 21-17, 21-19తో బ్రెజిల్‌కు చెందిన ఒలివేరియాను చిత్తుచేశాడు. మరో పోటీలో మన్‌దీప్ కౌర్ తొలి రౌండ్‌లోనే ఓటమిపాలైంది. పతకం ఖాయం చేసే షట్లర్లలో ఒకడైన 2వ సీడ్ మన్‌దీప్ నైజీరియా ప్లేయర్ మరియమ్ ఎనియోల బొలాజీ చేతిలో 8-21, 14-21తో మన్‌దీప్ పోరాడి ఓడింది.

తైక్వాండోలో అరుణ ఓటమి

తైక్వాండో మహిళల విభాగంలో అరుణ తన్వర్ గాయంతో వెనుదిరిగింది. మహిళల 44-55 కిలోల విభాగం రౌండ్-16లో అరుణ నిష్క్రమించింది. గురువారం జరిగిన తైక్వాండో 16వ రౌండ్‌లో అరుణ అత్యుత్తమ ఆట కనబరచలేకపోయింది. టర్కీకి చెందిన నురిచన్ ఎకిన్స్కీ చేతిలో ఆమె 0-19తో ఓడింది. ఐదు నిమిషాల పాటు సాగిన రౌండ్‌లో అరుణ ప్రత్యర్థికి ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది.

3వేల స్టీపుల్‌ఛేజ్‌లో షారుక్ జాతీయ రికార్డు

అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్



లిమా(పెరూ): ఇక్కడ జరుగుతున్న అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 3వేల మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో షారుక్ ఖాన్ జాతీయ రికార్డును బ్రేక్ చేశాడు. బుధవారం రాత్రి జరిగిన స్టీపుల్‌ఛేజ్‌లో భారత్‌కు చెందిన 18ఏళ్ల షారుక్ 8నిమిషాల 45:12సెకన్లలో గమ్యానికి చేరి 6వ స్థానంలో నిలిచాడు. దీంతో 31న జరిగే ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఈ హీట్‌లో తొలి ఎనిమిది స్థానాల్లో నిలిచిన అథ్లెట్లు ఫైనల్‌కు చేరతారు. అంతకుముందు ఈ రికార్డు 19ఏళ్ల రాజస్తాన్‌కు చెందిన రాజేశ్ పేర ఉండేది. అతడు భువనేశ్వర్ వేదికగా మేలో జరిగిన ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో 8నిమిషాల 50:12సెకన్లలో గమ్యానికి చేరి జాతీయ రికార్డును నెలకొల్పాడు. షారుక్ ఖాన్ పర్సనల్ బెస్ట్ 8నిమిషాల 51:75 సెకన్ల రికార్డును తాజాగా సవరించుకొన్నాడు. ఇక పురుషుల 400మీ. పరుగులో జయకుమార్ మూడోస్థానంలో నిలిచి సెమీస్‌కు చేరాడు. అతడు హీట్‌లో 400మీ. పరుగును 46.96సెకన్లలో గమ్యానికి చేరాడు.

రూట్ సెంచరీ

ఇంగ్లండ్ 327/7.. శ్రీలంకతో రెండోటెస్ట్

లండన్: మాజీ కెప్టెన్ జో రూట్(143) సెంచరీకి తోడు అట్కిన్సన్(53నాటౌట్) అర్ధసెంచరీతో మెరవడంతో ఇంగ్లండ్ భారీస్కోర్ దిశగా పయనిస్తోంది. శ్రీలంకతో లార్డ్ వేదికగా గురువారం నుంచి ప్రారంభమైన రెండోటెస్ట్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. తొలుత శ్రీలంక పేసర్ల ధాటికి తొలి సెషన్‌లోనే మూడు వికెట్లు పడిన జట్టుకు రూట్ ఆదుకున్నాడు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 7వికెట్ల నష్టానికి 327పరుగులు చేసింది. క్రీజ్‌లో అట్కిన్సన్‌కు తోడు పాట్స్(6) ఉన్నారు. శ్రీలంక బౌలర్లు ఫెర్నాండో, రత్నాయకే, కుమారకు రెండేసి వికెట్లు దక్కాయి.

మూడోరౌండ్‌కు జకోవిచ్, టఫీ

యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లోకి మాజీ నంబర్ వన్ ఆటగాడు, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ ప్రవేశించాడు. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో జకోవిచ్ 6-4, 6-4, 2-0తో ఆధిక్యతలో ఉండగా లస్లో డేరే(సెర్బియా) గాయంతో వైదొలిగాడు. మరో పోటీలో 14వ సీడ్ టఫీ(అమెరికా) 6-4, 6-1, 1-0తో ఆధిక్యత లో కజకిస్తాన్‌కు చెందిన అలెగ్జాండర్ కూడా గాయం కారణంగా మ్యాచ్‌ను వైదొలిగాడు. మరో పోటీ లో 12వ సీడ్ ఫ్రిట్జ్(అమెరికా) 6-3, 7-6(7-1), 6-1తో ఇటలీకి చెందిన బెర్రెట్టినిని చిత్తుచేసి మూడోరౌం డ్‌కు చేరాడు. 8వ సీడ్ రూడ్(డెన్మార్క్)6-4, 6-2, 4-6, 7-6(7-3)తో మోన్‌ఫిల్(ఫ్రాన్స్)ను ఓడించాడు.

కసట్కినా ఔట్..

మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్, రష్యాకు చెందిన కసట్కినా అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. గురువారం జరిగిన రెండోరౌండ్ పోటీలో కసట్కినా 1-6, 6-7(3-7)తో ఓటమిపాలైంది. ఇతర పోటీల్లో 12వ సీడ్ స్విటోలినా(ఉక్రెయిన్) 6-1, 6-2తో తన దేశానికే చెందిన కలినినాను ఓడించగా.. 3వ సీడ్ అమెరికా సంచలనం కోకా గాఫ్ 6-4, 6-0తో మారియా(జర్మనీ)పై సునాయాకంగా నెగ్గి మూడోరౌండ్‌కు చేరింది. ఇక 15వ సీడ్ కలిన్సయా(రష్యా) 6-2, 6-4తో హంగేరికి చెందిన బోండర్‌ను, 30వ సీడ్ పుటిన్సెవా(కజకిస్తాన్) 6-1, 7-6(7-4)తో వాంగ్(చైనా)ను ఓడించి మూడోరౌండ్‌కు చేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68